
E-KABURU

# ఈ-కబురు

28-02-2025 శుక్రవారం హైదరాబాద్ ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

www.ekaburu.com

పుట్టబోయే పిల్లల గురించి కామెంట్లా!



6లో

# సంక్షేమం, అభివృద్ధికే పెద్దపీట

నేడు 2025-26 వార్షిక పూర్తిస్థాయి బడ్జెట్

అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న కూటమి ప్రభుత్వం

సూపర్? సిక్స్? పథకాలకు ప్రాధాన్యత


ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా భారీగా కేటాయింపులు

మూల ధన వ్యయాన్ని మరింత పెంచేలా ప్లాన్?

తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఫ్రీ బస్సు కీలకం

రాజధాని ప్రాంతం అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం

పలు అంశాలపై కీలక సూచనలు చేసిన సీఎం చంద్రబాబు



**అమరావతి, ఈ-కబురు:** కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2025-26 వార్షిక బడ్జెట్ శుక్రవారం (నేడు) అసెంబ్లీలో ప్రవేశపెట్టనుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తిస్థాయిలో ప్రవేశపెడుతోంది. బడ్జెట్‌పై సీఎం చంద్రబాబు ఇప్పటికే పలుమార్లు సమీక్షలు నిర్వహించారు. సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేయనున్నారు. ఇక సూపర్ సిక్స్ పథకాలకు ఈ బడ్జెట్లో కేటాయింపులు చేయనున్నారు. కేంద్ర ప్రయోగిత కార్యక్రమాలకు కూడా భారీ ప్రాధాన్యత ఇవ్వనున్నారు. 2025-26 బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సభలో ప్రవేశపెట్టనున్నారు ..

**సంక్షేమం ఆగకుండా..**

సూపర్ సిక్స్ పథకాల్లో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, దీపం 2.0, సామాజిక భద్రతా పెన్షన్లు, అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణ కీలకమైనవి. వీటిలో కొన్నింటిని ఇప్పటికే అమలు చేస్తున్నారు. మరికొన్నింటిని త్వరలోనే అమలు చేస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. హామీల అమలుకు భారీగా నిధులు కేటాయించాల్సి ఉంటుంది. రాష్ట్రంలో ఆర్థిక లోటు ఉన్నా, సంక్షేమ పథకాలను నెరవేర్చేందుకు ప్రభుత్వం

మిగతా 2లో





# ప్రపంచంతోనే మా పోటీ

తెలంగాణ రైజింగ్‌ను ఎవరూ ఆపలేరు

అత్యంత వేగంగా హైదరాబాద్ అభివృద్ధి

ఏడాదిలోనే అత్యధిక పెట్టుబడులు

ఉద్యోగ కల్పనలో నెంబర్.1గా నిలిచాం

హెచ్‌సీఎల్ టెక్ క్యాంపస్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, ఈ-కబురు:** హైదరాబాద్ ప్రపంచంచ స్థాయి నగరంగా వేగంగా ఎదుగుతున్నదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ మాదాపూర్‌లో గురువారం హెచ్‌సీఎల్ టెక్ నూతన క్యాంపస్‌ను సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. మల్టినేషనల్, బడా కార్పొరేట్ సంస్థలతో హైదరాబాద్ వచ్చేందుకు ఆసక్తి చూపుతున్నాయని, ప్రతిరోజు తాను ఈ సంస్థలతో ఎంవోయూలు, లేదా కార్యా లయాల ప్రారంభోత్సవాలు చేస్తున్నట్లు వెల్లడించారు. తాము అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే హయ్యెస్ట్ ఇన్వెస్ట్ మెంట్లు రాబట్టగలిగామన్నారు. ఉద్యోగాల కల్పనపై ఫోకస్ పెట్టామని,

మిగతా 2లో

# బ్లాక్‌మెయిల్ రాజకీయాలు మానుకో

2లో

బెదిరింపులకు భయపడే వ్యక్తిని కాదు

ప్రాజెక్టును అడ్డుకున్నట్లు నిరూపించాలి

మెట్రోకోసం ప్రభుత్వం దగ్గర ఒక్క పైసా లేదు

రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సవాల్





# మహాకుంభ మేళా.. గిన్నిస్ రికార్డు

మూడు గిన్నిస్ రికార్డుల నమోదు

భక్తుల శివ నామస్మరణలతో ముగిసిన మహాకుంభ మేళా

45 రోజుల పాటు కొనసాగిన కార్యక్రమం

66 కోట్ల మందికి పైగా భక్తుల పవిత్ర స్నానాలు

2లో

# నిజాలు చెరిపేయొద్దు

కాళేశ్వరంపై వాడివేడిగా విచారణ


కమిషన్ ఎదుట రిటైర్డ్ ఈఎన్సీలు హాజరు

బ్యారేజీల లొకేషన్ ఎందుకు మార్చారు?

పనుల ఆలస్యంపై ఏజెన్సీలకు పెనాల్టీలు వేశారా?

ఈఎన్సీలను క్రాస్ ఎగ్జామినేషన్ చేసిన కమిషన్

2లో





# రష్యాకు కిమ్ సైనికులు!

దక్షిణ కొరియా నిఘా విభాగం వెల్లడి

ఉక్రెయిన్, రష్యా మధ్య యుద్ధం

2లో

ప్రాణాలు కోల్పోయిన వందల మంది కిమ్ సైనికులు

రష్యాకు భారీస్థాయిలో మందుగుండు సామగ్రి

# ఇదేమన్నా టూరిస్ట్ ప్లేసా..?

మంత్రులు రోజూ వస్తున్నారు.. పోతున్నారు

ఆరు రోజులైనా సీఎం రేవంత్‌రెడ్డి రాలేదు

ఎందుకింత బాధ్యతారాహిత్యం..?

మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పరిశీలనకు బీఆర్ఎస్‌కు అనుమతించని పోలీసులు

నిరసనకు దిగడంతో ఒకే చెప్పిన అధికారులు

2లో





# జగన్‌తో కుమ్మక్కు

ప్రగతిభవన్‌లో విందులు, వినోదాలు

తెలంగాణకు తీరని అన్యాయం

2లో

హరీశ్‌రావు మాటలు పూర్తి అబద్ధాలు

పాలమూరు రంగారెడ్డితో ఒక ఎకరాకు నీరందించారా?

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



# అభ్యర్థుల భవితవ్యం.. ఈవీఎంలో నిక్షిప్తం

తెలుగు రాష్ట్రాల్లో ముగిసిన ఎమ్మెల్సీ పోలింగ్

ఏపీలో 3, తెలంగాణలో 3 స్థానాలకు ఎన్నికలు

విశాఖపట్నం జిల్లాలో 87.30 శాతం

ఎన్టీఆర్ జిల్లాలో 65.69 శాతం నమోదు

మార్చి 3వ తేదీన ఓట్ల లెక్కింపు

2లో

# ప్రపంచంతోనే మా పోటీ

మొదటి పేజీ తరువాయి

ఎక్కువ ఏఐ వినియోగం తక్కువ ద్రవోల్బణంతో ముందుకు వెళ్తున్నారు చెప్పారు.

**1 ట్రిలియన్ డాలర్ జీడీపీ సాధ్యమే..**

తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ జీడీపీగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నామని, కొంతమంది ఇది అసాధ్యం అంటున్నారన్నారు. కానీ, తెలంగాణకు వస్తోన్న పెట్టుబడులు, కుదుర్చుకుంటున్న ఒప్పందాలు చూశాక రాష్ట్రం ఎదుగుదలను ఆపలేమని అందరు అంగీకరించక తప్పడం లేదన్నారు. నా పోటీ పొరుగు రాష్ట్రాలతో కాదని ప్రపంచస్థాయి నగరంలో తీర్చిదిద్దేందుకు ఆలోచన చేస్తున్నామన్నారు. తెలంగాణలో కొత్త ఈవీ పాలసీ తీసుకువచ్చామని, డేటా సెంటర్ హబ్‌గా రాష్ట్రాన్ని మార్చుతున్నామన్నారు. అన్నిరంగాల్లో తెలంగాణ దూసుకుపోతున్నదన్నారు. తెలంగాణ రైజింగ్ అంశాన్ని తానే ప్రస్తావిస్తే తొలుత అందరూ సందేహాలు వ్యక్తం చేశారని, కానీ ఇప్పుడు ప్రపంచమే అంగీకరిస్తున్నదన్నారు. లైఫ్ సైన్సెస్‌లో ప్రపంచంలోనే మేటీ అయిన ఆమ్‌జెన్ సంస్థలను ఆహ్వానించామన్నారు. బయో ఆసియా 2025 సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. హెచ్‌సీఎల్ దేశాన్ని గర్వపడేలా చేస్తోందని, 60 దేశాల్లో 2.2 లక్షల మందితో పనిచేస్తున్నదని కొనియాడారు. 2007లో హైదరాబాద్‌లో అడుగుపెట్టిన హెచ్‌సీఎల్ ఇప్పుడు భారీగా ఎదిగిందని గుర్తుచేశారు. తెలంగాణ ప్రభుత్వం మాదిరిగా హెచ్‌సీఎల్ కూడా తెలంగాణలో అద్భుతంగా పనిచేస్తున్నదన్నారు.

**ఎమ్మార్ ప్రాపర్టీస్ ప్రాజెక్టులపై లీగల్ ఏజెన్సీ..**

పెండింగ్‌లో ఉన్న పలు ప్రాజెక్టులపై సీఎం రేవంత్‌రెడ్డి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గురువారం సచివాలయంలో సీఎం, మంత్రి శ్రీధర్ బాబుతో ఎమ్మార్ ప్రతినిధుల సమావేశమయ్యారు. సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. భేటీలో ఎమ్మార్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ మహమ్మద్ అలబ్బర్, భారత్‌లో యూఏఈ మాజీ రాయబారి డాక్టర్ అహ్మద్ అల్ బన్నా, ఎమ్మార్ గ్రూప్ సీఈవో అమిత్ జైన్, ఆ కంపెనీ ఇంటర్నేషనల్ అఫైర్స్ హెడ్ ముస్తఫా అక్రమ్ పాల్గొన్నారు.

**ఒప్పందాల్లో అక్రమాలు..**

వివిధ కేసులతో పెండింగ్‌లో ఉన్న తమ ప్రాజెక్టుల వివాదాలను పరిష్కరించాలని ఎమ్మార్ ప్రాపర్టీస్ సంస్థ ప్రతినిధులు కోరారు. 2001లో ఉమ్మడి రాష్ట్రంలో దుబాయికు చెందిన ఎమ్మార్ ప్రాపర్టీస్ హైదరాబాద్‌లో కన్వెన్షన్ సెంటర్, హోటల్, గోల్ఫ్ కోర్సు, విల్లాలు తదితర ప్రాజెక్టుల్లో పెట్టుబడులకు అప్పటి ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకుందని గుర్తుచేశారు. ఏపీఐఐసీతో ఆ సంస్థ చేసుకున్న ఒప్పందాల్లో అక్రమాలు జరిగాయని అప్పట్లో సీబీఐ, ఈడీ కేసులు నమోదయ్యాయని చెప్పారు. ఏజెన్సీల దర్యాప్తులు, కోర్టుల్లో విచారణలు కొనసాగుతున్నాయన్నారు. తెలంగాణ ఏర్పడ్డ తర్వాత 2015 అక్టోబర్‌లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎమ్మార్ ప్రాపర్టీస్‌కు సంబంధించిన ప్రాజెక్టుల వివాదాల పరిష్కారానికి ఛీప్ సెక్రటరీ సారథ్యంలో ఐదుగురు సెక్రటరీల కమిటీని ఏర్పాటు చేసిందని వివరించారు.

**కమిటీని ఏర్పాటు చేయాలి..**

మరోవైపు కేంద్ర విదేశాంగ శాఖ, సొలిసిటర్ జనరల్ ఆఫ్ ఇండియా కూడా ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వానికి పలు సూచనలు చేశారు. ఎమ్మార్ ప్రతినిధులతో జరిగిన చర్చల సందర్భంగా ఈ అంశాలన్నింటినీ అధికారులు సీఎంకు నివేదించారు. వివిధ దర్యాప్తు ఏజెన్సీల కేసులు, ఛార్జీషీట్లు, న్యాయపరమైన అంశాలతో ముడిపడి ఉన్నందున ఎమ్మార్ ఒప్పందాల డాక్యుమెంట్లు, కోర్టు కేసుల వివరాలతో పాటు కేంద్ర ప్రభుత్వ సూచనలన్నీ క్షుణంగా పరిశీలించాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఎమ్మార్ ప్రాపర్టీస్ వ్యవహారాన్ని పరిష్కరించేందుకు 2015లో ఛీఫ్ సెక్రటరీ నేతృత్వంలో అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీకి అదనంగా న్యాయ నిపుణులతో కూడిన కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. న్యాయ వివాదాలను అధ్యయనం చేయడానికి, సామరస్య పూర్వక పరిష్కారం చేసుకోవడానికి యూఏఈ ప్రభుత్వ ఆమోదంతో ఒక లీగల్ ఏజెన్సీని ఏర్పాటు చేస్తామని సంస్థ ప్రతినిధులు ప్రతిపాదించగా, వారి ప్రతిపాదనను సీఎం అమోదించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసే కమిటీ వారితో సంప్రదింపులు జరిపి తదుపరి సూచనలు, సలహాలు అందిస్తుందని సీఎం పేర్కొన్నారు.

## నిజాలు చెరిపేయొద్దు

**హైదరాబాద్, ఈ-కబురు:** కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో అవకతవకలపై జస్టిస్ పీసీ ఘోష్ జరిపిన విచారణ గురువారం వాడివేడిగా సాగింది. కమిషన్ ఎదుట రిటైర్డ్ ఈఎన్సీలు నల్ల వెంకటేశ్వర్లు, మురళీధర్‌రావు, హరిరామ్, సీడీఓ మాజీ సీఈ నరేందర్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. ముగ్గురు ఈఎన్సీలను ఒకేసారి కూర్చోపెట్టి కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్ చేసింది. చేసిన ప్రతిజ్ఞకు న్యాయం చేయాలని, నిజాలను చెరిపేయొద్దని కమిషన్ వ్యాఖ్యానించింది. ఇంజినీర్లు పలు డాక్యుమెంట్లను దాచారని కమిషన్ ప్రశ్నించింది. డిజైన్స్, డీపీఆర్, నిర్మాణ సంస్థకు ప్రభుత్వానికి మధ్య జరిగిన ఒప్పందంపై కమిషన్ ప్రశ్నలు సంధించింది.

**లొకేషన్ మార్పు ఎవరి ఆదేశాల మేరకు జరిగింది..**

అన్నారం, సుందిళ్ల, లొకేషన్ మార్పు ఎవరి ఆదేశాల మేరకు జరిగిందని కమిషన్ ప్రశ్నించగా, అప్పటి సీఎం కేసీఆర్, అప్పటి ఇరిగేషన్ మంత్రి హరీశ్‌రావు ఆదేశాల మేరకు మార్చినట్లు అధికారులు తెలిపారు. బ్యారేజీలలో నీళ్లను నింపమని ఎవరు ఆదేశించారని కమిషన్ ప్రశ్నించగా.. కేసీఆర్, అప్పటి ఇరిగేషన్ మంత్రి ఆదేశాల మేరకు నీళ్లను స్టోరేజ్ చేశామని అధికారులు తెలిపారు. కమిషన్ అడిగిన ప్రశ్నలకు మాజీ ఈఎన్సీ జనరల్ మురళీధర్‌రావు గుర్తుకు లేదని సమాధానం ఇచ్చారు. డీపీఆర్ తయారీలో వ్యాప్ కాన్ సంస్థకు పనులు అలాట్ చేయాలని ఎవరు ఆదేశించారని కమిషన్ అడగగా, గత ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకే వ్యాప్కన్ సంస్థకు డీపీఆర్ పనులను అలాట్ చేశామని అధికారులు వివరించారు.

## మహాకుంభ మేళా.. గిన్నిస్ రికార్డు

**నేషనల్ బ్యూరో, ఈ-కబురు:** ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభమేళా శివరాత్రి పర్వదినం వేళ.. భక్తుల శివ నామస్మరణల మధ్య ముగిసింది. జనవరి 13న ప్రారంభమైన ఈ మహాకుంభమేళా 45 రోజుల పాటు సాగింది. ఈ సందర్భంగా దేశ విదేశాల నుంచి వచ్చిన దాదాపు 66 కోట్ల మందికి పైగా భక్తులు ప్రయాగ్ రాజ్‌లోని త్రివేణి సంగమంలో పవిత్ర స్నానమాచరించి తరించారు.

**మూడు గిన్నిస్ రికార్డుల నమోదు..**

మహాకుంభమేళా మూడు గిన్నిస్ రికార్డులను నమోదు చేసుకొంది. మహాకుంభమేళలో భాగంగా హ్యాండ్ పెయింటింగ్ నిర్వహించారు. ఇందులో 10,102 మంది పాల్గొన్నారు. సమైక్యత, సామాజిక సామరస్యం, సమగ్రతలో ఏకత్వం అనే స్ఫూర్తితో తమ భావాలను వ్యక్తపరిచారని అధికారిక వర్గాలు తెలిపాయి. లక్షల మందితో ప్రపంచంలోనే అతిపెద్ద యోగాసానాలు వేశారు. లక్షల మంది భక్తులు ఒకేచోట చేరి భక్తి స్తోత్రాలను పఠించారు. ఇలా మూడు గిన్నిస్ రికార్డులను నెలకొల్పారు. మహాకుంభమేళా ముగిసిన నేపథ్యంలో ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ స్పందించారు. ప్రపంచ చరిత్రలోనే ఇది అపూర్వమైనదని, ఈ ఘటన మరపురానిదని అభివర్ణించారు. ఈ మహా కుంభమేళా ఇంతటి విజయవంతం కావడానికి దార్శనికులు, సాధువులు, అఘోరాలతోపాటు మతపెద్దల ఆశీర్వాద బలమేనని స్పష్టం చేశారు. కుంభమేళా అద్భుతమైన దృశ్యంగా మలిచారన్నారు. తద్వారా మొత్తం ప్రపంచానికి ఐక్యతా సందేశాన్ని ఇచ్చినట్లు అయిందన్నారు. 45 రోజులపాటు సాగిన మహాకుంభమేళాలో ఆరు ప్రత్యేక తేదీలు ఉన్నాయి.. జనవరి 13న పుష్య పౌర్ణమి, జనవరి 14 మకర సంక్రాంతి, జనవరి 29న మౌని అమావాస్య, ఫిబ్రవరి 3వ తేదీ వసంత పంచమి, ఫిబ్రవరి 12వ తేదీ మాఘ పూర్ణిమ, జనవరి 26వ తేదీ మహా శివరాత్రిలలో అమృత స్నానాలకు భక్తులు పోటెత్తారు. గంగానదిని నాలుగు ప్రాంతాల్లో ప్రక్షాళన చేయడం రికార్డు సృష్టించింది. ఇందులో 360 మంది పాల్గొని శుద్ధి చేయడం ఓ రికార్డు. 2019లో జరిగిన కుంభమేళాలో 7,660 మంది పాల్గొన్నారు. ఈ సారి భక్తులు లెక్కకు మిక్కిలిగా పాల్గొన్నారు.

# ఇదేమన్నా టూరిస్ట్ ప్లేసా..?

**నాగర్‌కర్నూల్, ఈ-కబురు:** మంత్రులు రోజూ వస్తున్నారు.. పోతున్నారు.. ఇదేమన్నా టూరిస్టు ప్లేసా..? అని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రశ్నించారు. ఎస్-ఎల్‌బీసీ టన్నెల్‌లో చిక్కుకున్న ఎనిమిది మంది ప్రాణాలపై పట్టింపు లేదా అని నిలదీశారు. సహాయక చర్యల్లో ప్రభుత్వం స్పష్టమైన డెరెక్షన్ లేకుండా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రమాద ఘటన జరిగి ఆరు రోజులైనా సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికీ రాలేదని, ఎందుకింత బాధ్యతారాహిత్యం..? అని ప్రశ్నించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు.



**ఎన్నికల ప్రచారం ముఖ్యమా?**

ఎన్నికల ప్రచారం ముఖ్యమా? 8 మంది ప్రాణాలు కాపాడటం ముఖ్యమా? అని రేవంత్‌ను నిలదీశారు. బృందాల మధ్య సమన్వయం సాధించడంలో ప్రభుత్వం విలఫమైందన్నారు. టన్నెల్‌లోకి వెళ్లేందుకు తమకు అనుమతి ఇవ్వలేదని, సహాయ చర్యలకు ఇబ్బంది అవుతుందనే ఉద్దేశంతో రాలేదని, ప్రజాప్రతినిధులు మంత్రిని కలవకూడదా..? ప్రమాదానికి సంబంధించిన విషయాల గురించి మాట్లాడకూడదా..? ఇదెక్కడి ప్రజాపాలన..? అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు.

**తీసింది తట్టెడు మట్టి..**

ఆరు రోజుల తర్వాత తీసింది కేవలం తట్టెడు మట్టి మాత్రమే అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి, నిర్లక్ష్యంతో 14 నెలల్లో 4 ప్రాజెక్టులు కొట్టుకుపోయాయని విమర్శించారు. ప్రమాద ఘటనలో చిక్కుకున్న 8 మంది కార్మికుల ప్రాణాలు కాపాడే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఉన్న ప్రాజెక్టులను కాపాడలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. ఏపీ ప్రభుత్వం అక్రమంగా కృష్ణా జలాలు తరలించుకుపోతోందని, మన నీటిని ఏపీ తరలించుకుపోతుంటే ప్రభుత్వం ఆపడం లేదని మండిపడ్డారు. గోదావరిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టు నిర్మిస్తుంటే సీఎం రేవంత్ నోరెత్తడం లేదన్నారు. కృష్ణా జలాలపై తాము నిలదీసిన తర్వాత కేఆర్ఎంబీ వద్దకు ఫిర్యాదు చేశారని, రాష్ట్ర హక్కులను కాపాడటంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు.

**బీఆర్ఎస్ నేతల ఆందోళన..**

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాద స్థలాన్ని పరిశీలించేందుకు వచ్చిన తమను అడ్డుకోవడాన్ని నిరసిస్తూ మాజీమంత్రి హరీశ్‌రావు సారథ్యంలోని బృందం ఎస్-ఎల్‌బీసీ కార్యాలయం సమీపంలో బైఠాయించి ఆందోళనకు దిగారు. గురువారం మధ్యాహ్నం టన్నెల్ సందర్శనకు బయలుదేరిన బీఆర్ఎస్ బృందాన్ని మూడు చోట్ల పోలీసులు తనిఖీ చేశారు. మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలకు, మరో ఐదారుగురు ముఖ్య నాయకులకు మాత్రమే అనుమతి ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకోవడానికి ముందు పోలీసులు మరిన్ని ఆంక్షలు విధించడంతో హరీశ్‌రావు సహా మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, డాక్టర్ సి. లక్ష్మారెడ్డి తదితరులు నిరసనకు దిగి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో పోలీసులు టన్నెల్ సందర్శనకు అనుమతి ఇచ్చారు. దీంతో బీఆర్ఎస్ టీమ్ సొరంగం వద్దకు చేరుకుని పరిశీలించారు.

# సంక్షేమం, అభివృద్ధికే పెద్దపీట

మొదటి పేజీ తరువాయి

కట్టుబడి ఉందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

**అమరావతి పూర్తికి చర్యలు..**

రాజధాని అభివృద్ధిని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కూటమి ప్రభుత్వం మూడేళ్లలో రూ.60వేల కోట్ల వ్యయంతో అమరావతిని పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రపంచ బ్యాంకు, ఆసియా డెవలప్‌మెంట్ వంటి అంతర్జాతీయ సంస్థల నుంచి రూ.30వేల కోట్ల పైగా రుణాలకు హామీ తెచ్చుకున్నట్లు తెలుస్తోంది. బడ్జెట్ సందర్భంగా మరింత క్లారిటీ ఇవ్వనుంది. పట్టణ పునరుద్ధరణ ప్రాజెక్టులు, మెరుగైన రహదారి కనెక్టివిటీ, పరిశ్రమల వృద్ధి, పునరుత్పత్తి శక్తి రంగాల్లో పెట్టుబడులు బడ్జెట్‌లో ముఖ్య ప్రాధాన్యం పొందనున్నాయి.

**డిజిటల్ గవర్నెన్స్, ఐటీ హబ్‌లు..**

ముఖ్యంగా డిజిటల్ గవర్నెన్స్, ఐటీ హబ్‌ల అభివృద్ధి, తయారీ పరిశ్రమల వృద్ధి తదితర రంగాల్లో ప్రత్యేక నిధులు కేటాయించే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వ పథకాలతో సమన్వయం చేసుకుంటూ, రాష్ట్ర బడ్జెట్‌లో విద్య, ఆరోగ్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వనున్నారు. పాఠశాలల మౌలిక సదుపాయాల మెరుగుదల, ఉచిత ఆరోగ్య సంరక్షణ పథకాలు, గ్రామీణ ఆరోగ్య కేంద్రాల బలోపేతం బడ్జెట్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

**మౌలిక వసతులు, పరిశ్రమల పెట్టుబడులు..**

ఆర్థిక శాఖకు 28 శాఖల బడ్జెట్ సమీక్షలు పూర్తికావడంతో, మంత్రులంతా తమ శాఖలకు అధిక నిధులు కేటాయించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

# జగన్‌తో కుమ్మక్కు

**హైదరాబాద్, ఈ-కబురు:** మాజీ మంత్రి హరీశ్‌రావు మాటలు పూర్తి అబద్ధాలు, గోబెల్స్ ప్రచారమేనని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ద్వారా 30 టీఎంసీల నీళ్లు వచ్చేవని, కానీ బీఆర్ఎస్ హయాంలో పనులు పూర్తిచేయకుండా వదిలిపెట్టారని మండిపడ్డారు. పనులు పూర్తి చేసి ఉంటే నల్లగొండలో నాలుగు లక్షల ఎకరాలు సాగులోకి వచ్చేవన్నారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో జరిగిన ప్రమాదాన్నిఅందరికీ చూడటానికి అనుమతిస్తున్నామని, ఎవరినీ ప్రభుత్వం అడ్డుకోవడం లేదని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో ఎన్ని ప్రమాదాలు జరిగినా ప్రతిపక్షంలో ఉన్న తమకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని ప్రశ్నించారు. రెండు, మూడు నెలల్లో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు పున ప్రారంభిస్తామని తెలిపారు. రెండు మూడు రోజుల్లో సహాయక చర్యలు పూర్తిచేస్తామన్నారు. పదేళ్లపాటు బీఆర్ఎస్ అధికారంలో ఉందని, ఎస్ఎల్‌బీసీ టన్నెల్ అనుమతుల గురించి మాట్లాడుతున్నారని చెప్పారు. అప్పుడు మాట్లాడని నేతలు ఇప్పుడు మాట్లాడటం విడ్డూరంగా ఉందని మంత్రి విమర్శించారు. కేసీఆర్ హయాంలో రూ.1.81 లక్షల కోట్లు ఖర్చుపెట్టి నామమాత్రపు పనులు చేశారని మంత్రి మండిపడ్డారు. నీటిపారుదల శాఖను నిర్వీర్యం చేసిన ఘనత కేసీఆర్, హరీశ్‌రావుకు దక్కుతుందని విమర్శించారు. తాము ప్రజాస్వామ్యయుతంగా ముందుకు పోతున్నామని చెప్పారు. కేసీఆర్ హయాంలో శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం బ్లాస్ట్ జరిగి 9 మంది చనిపోతే ఒక్కరూ కూడా ఎందుకు పరామర్శకు రాలేదని ప్రశ్నించారు. ఆ రోజు రేవంత్ వస్తుంటే అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారని గుర్తుచేశారు. దేవాదులలో ఏడు మంది చనిపోతే వాళ్ల ఆస్తిపంజరాలు ఐదేళ్ల తర్వాత దొరికాయని చెప్పారు. హరీశ్‌రావు ఎప్పుడైనా ఆ విషయం గురించి మాట్లాడారా అని నిలదీశారు. కేసీఆర్ హయాంలో ఎన్నో ప్రమాదాలు జరిగినప్పటికీ అడిగే నాథుడే లేరన్నారు. ఇప్పుడు హరీశ్‌రావు ఎస్-ఎల్‌బీసీ టన్నెల్ వద్దకు వచ్చి పెద్దపెద్ద మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో జగన్‌తో కుమ్మక్కై ప్రగతిభవన్‌లో విందులు, వినోదాలు చేసుకుంటుంటే జగన్ కృష్ణానదిని దోచుకువెళ్లారని విమర్శించారు.

## రష్యాకు కిమ్ సైనికులు!

**నేషనల్ బ్యూరో, ఈ-కబురు:** ఉక్రెయిన్ యుద్ధంలో రష్యా తరఫున ఉత్తర కొరియా సైన్యం కూడా పాల్గొంటున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో వందల మంది కిమ్ సైనికులు ప్రాణాలు కోల్పోయినట్లు నివేదికలు వచ్చాయి. అయినప్పటికీ తాజాగా మరిన్ని బలగాలను కిమ్ రష్యాకు పంపించినట్లు దక్షిణ కొరియా నిఘా విభాగం నేషనల్ ఇంటలిజెన్స్ సర్వీస్ వెల్లడించింది. ఈసారి ఎంతమందిని పంపించిందనే విషయాన్ని తెలుసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపింది.

**రష్యాకు భారీ స్థాయిలో ఆయుధాలు..**

రష్యాకు భారీస్థాయిలో ఆయుధాలు, మందుగుండు సామగ్రి పంపిస్తోన్న ఉత్తర కొరియా.. కొంతకాలం క్రితం 10 నుంచి 12వేల మంది సైనికులను పంపించినట్లు అమెరికా, దక్షిణ కొరియాతోపాటు ఉక్రెయిన్ నిఘా విభాగాలు వెల్లడించాయి. గడిచిన రెండు నెలల్లో కుర్స్క్ ప్రాంతంలో వెయ్యి నుంచి 3వేల మంది కిమ్ సైన్యాన్ని మోహరించినట్లు తెలుస్తోంది.

**డ్రోన్ దాడులకు లక్ష్యంగా..**

ఉత్తరకొరియా సైనికులు చాలా క్రమశిక్షణతోపాటు మంచి శిక్షణ కూడా పొంది ఉన్నట్లు కనిపిస్తున్నారని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. యుద్ధక్షేత్రంలో అనుభవలేమి, అక్కడి భూభాగంపై అవగాహన లేకపోవడంలో డ్రోన్ దాడులకు లక్ష్యంగా మారుతున్నట్లు సమాచారం. జనవరిలోనే 300 మంది కిమ్ సైనికులు చనిపోగా, 2700 మంది గాయపడినట్లు అంచనా. మొత్తంగా 4వేల మంది ఉత్తర కొరియా సైనికులు చనిపోవడమో లేదా గాయపడినట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ చెప్పినప్పటికీ.. అమెరికా మాత్రం ఈ సంఖ్య 1200గా పేర్కొంది.

**యుద్ధం ముగింపు కోసం సౌదీ అరేబియా వేదికగా చర్చలు..**

సైనిక, ఆయుధ సాయాన్ని అందిస్తోన్న ఉత్తర కొరియాకు బహుమానంగా.. రష్యా అత్యాధునిక ఆయుధాలు, అత్యున్నత సాంకేతికతను అందజేయవచ్చని తెలుస్తోంది. దీంతో ఉత్తర కొరియా అణ్వాయుధ కార్యక్రమాన్ని మరింత బలోపేతం చేసుకోవచ్చని దక్షిణ కొరియా, అమెరికా మిత్రపక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. క్రెయిన్-రష్యా యుద్ధం ముగింపు కోసం సౌదీ అరేబియా వేదికగా చర్చలు జరుగుతున్న వేళ ఉత్తర కొరియా అదనపు బలగాలు పంపించడం గమనార్హం. అయితే, ముగింపునకు ముందే మరిన్ని బలగాలు పంపించి రష్యా నుంచి మరింత సాయం పొందేందుకు కిమ్ ప్రయత్నాలు చేసే అవకాశం లేకపోలేదని పరిశీలకులు చెబుతున్నారు.

## అభ్యర్థుల భవితవ్యం.. ఈవీఎంల్లో నిక్షిప్తం

**హైదరాబాద్, ఈ-కబురు:** తెలుగు రాష్ట్రాల్లో బుధవారం ఆరు ఎమ్మెల్సీ స్థానాలకు పోలింగ్ ప్రక్రియ ముగిసింది. ఏపీలో 3, తెలంగాణలో 3 ఎమ్మెల్సీ స్థానాలకు పోలింగ్ జరిగింది. సాయంత్రం 4 గంటల వరకు క్యూ లైన్లలో ఉన్న వారికి ఓటు వేసే అవకాశం కల్పించారు. ఏపీలో 2 గ్రాడ్యుయేట్, ఒక టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికలు జరిగాయి. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పోలింగ్ సమయం ముగిసే నాటికి పశ్చిమ గోదావరి జిల్లాలో 65.43 శాతం నమోదు అయినట్లు అధికారులు తెలిపారు. దీంతోపాటు టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విశాఖపట్నం జిల్లాలో 87.30 శాతం పోలింగ్ నమోదైంది. ఎన్‌టీఆర్ జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ముగిసే సమయానికి 65.69 శాతం నమోదు అయింది.

**హక్కు వినియోగించుకున్న చంద్రబాబు, లోకేష్**

ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉండవల్లిలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో వారు ఓటు వేశారు. ఉమ్మడి గుంటూరు కృష్ణా జిల్లాల్లో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. తెనాలిలో మంత్రి నాదెండ్ల మనోహర్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పొన్నూరు జిల్లా పరిషత్ హై స్కూల్‌లో ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్ర కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేశారు.

**ఇబ్రహీంపట్నంలో ఒకరి ఓటు మరొకరు..**

ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం జాకీర్ హుస్సేన్ డిగ్రీ కళాశాల బూత్ నెంబర్ 45లో క్రమ సంఖ్య 331లో గుంటుపల్లికి చెందిన పాటిబండ్ల జ్ఞానదీప్తి ఓటును మరొకరు వేశారు. ఓటు వేసేందుకు వెళ్లిన ఆమె ఓటు పోలైనట్లు పోలింగ్ అధికారులు తెలపడంతో ఖంగుతిన్నారు. వెంటనే ఎన్నికల సహాయ అధికారి వై.వెంకటేశ్వర్లు దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. ఆయన పోలింగ్ అధికారులతో మాట్లాడారు. పోలింగ్ అధికారులు ఆమెకు చాలెంజ్ ఓటు వేసే అవకాశం కల్పించారు.

**తెలంగాణలోని మూడు స్థానాల్లో..**

తెలంగాణలోని మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో పోలింగ్ ముగిసింది. ఉమ్మడి కరీంనగర్- మెదక్-నిజామాబాద్- ఆదిలాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి 40.61 శాతం, టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి 63.49 శాతం పోలింగ్ నమోదు కాగా, వరంగల్- నల్లగొండ- ఖమ్మం టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి 90 శాతం పోలింగ్ నమోదు అయినట్లు అధికారులు తెలిపారు. మార్చి 3వ తేదీన తుది ఫలితాలను ఎన్నికల కమిషన్ వెల్లడించనుంది. పెద్దపల్లిలో అత్యధికంగా 77.95 శాతం పోలింగ్ నమోదైంది. నల్లగొండ టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి 90 శాతం పోలింగ్ నమోదు కావడం విశేషం. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పోలింగ్ 80 శాతం దాటింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కూడా 80 శాతం దాటింది.

## బ్లాక్‌మెయిల్ రాజకీయాలు మానుకో

**హైదరాబాద్, ఈ-కబురు:** సీఎం రేవంత్‌రెడ్డి చేసిన విమర్శలపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పందించారు. తాను ఏదైనా ప్రాజెక్టును అడ్డుకున్నట్లు నిరూపించాలని సవాల్ విసిరారు. హైదరాబాద్‌లోని మెట్రో రెండో దశ ప్రాజెక్టును కేంద్ర కేబినెట్ వద్దకు వెళ్లకుండా కిషన్‌రెడ్డి అడ్డుకున్నారని రేవంత్ బుధవారం వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో బుధవారం ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు.

**అవగాహనా రాహిత్యంతో..**

సీఎంగా ఉన్న వ్యక్తి అవగాహనా రాహిత్యంతో మాట్లాడుతున్నారని, రేవంత్ రెడ్డి తెలంగాణకు ముఖ్యమంత్రి కావడం రాష్ట్ర ప్రజల దురదృష్టమని కిషన్ రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి ఒక విధానం ఉంటుందని, దానికి అనుగుణంగానే వ్యవహరిస్తారని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడుతూ దుందుడుకుగా వ్యవహరిస్తున్నారని, కేంద్రం ప్రభుత్వం నుంచి డబ్బులు తెచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తానని ఎన్నికల్లో చెప్పారా? అని ఆయన నిలదీశారు. మెట్రో రెండో దశ ప్రాజెక్టును కేంద్ర కేబినెట్ వద్దకు వెళ్లకుండా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డే అడ్డుకున్నారని, తన మిత్రుడు కేసీఆర్ పదేళ్లలో చేయని పని ఇప్పుడు చేస్తే రేవంత్‌రెడ్డికి పేరొస్తుందనే అలా చేశారని ఆరోపించారు. తనకు రాష్ట్ర ప్రయోజనాల కంటే పేరు ముఖ్యం కాదని, కావాలంటే అనుమతులు, నిధులు తెప్పించి ఆ పేరును కిషన్‌రెడ్డినే తెచ్చుకోమనండని సూచించారు. తాను కూడా ఆయన పేరే ఊరూరా ప్రచారం చేస్తానని, సన్మానం చేసి గండపెండేరం తొడుగుతానని వెల్లడించారు. తెలంగాణ అభివృద్ధికి అవసరమైన ఐదు ప్రాజెక్టులకు సహకరించాలని ప్రధాని మోదీకి విన్నవించామన్నారు.

## ఎమ్మెల్యేలను అడ్డుకుంటున్నారు: అతిషి

**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో అసెంబ్లీ సమావేశాల వేళ భాజపా సర్కారుపై ప్రతిపక్ష ఆమ్ ఆద్మీ పార్టీ సంచలన ఆరోపణలు చేసింది. తమ ఎమ్మెల్యేలను అసెంబ్లీ ప్రాంగణంలోకి రానివ్వకుండా బారికేడ్లు పెట్టి మరీ అడ్డుకుంటున్నారని ఆరోపించింది. ఈ మేరకు మాజీ సీఎం, శాసనసభలో ప్రతిపక్ష నేత ఆతిశీ ఎక్స్ వేదికగా ప్రభుత్వంపై మండిపడ్డారు. 'భాజపా నేతలు అధికారంలోకి రాగానే నియంతృత్వంలో అన్ని హద్దులు దాటేశారు. సభలో జై భీమ్ అని నినాదాలు చేసినందుకు మా పార్టీ ఎమ్మెల్యేలను మూడు రోజుల పాటు సస్పెండ్ చేశారు. ఇప్పుడు విధాన సభ ప్రాంగణంలోకి రాకుండా మమ్మల్ని అడ్డుకుంటున్నారు. ఢిల్లీ అసెంబ్లీ చరిత్రలో ఇలాంటి దారుణం ఎన్నడూ చోటుచేసుకోలేదని ఆమె దుయ్యబట్టారు.

## విశాఖ గీతంలో 5,6 తేదీల్లో కెరీర్ ఫెయిర్

### పదివేల ఉద్యోగాల కల్పన లక్ష్యం: లోకేశ్

**అమరావతి**: నిరుద్యోగులకు మంత్రి నారా లోకేశ్ శుభవార్త చెప్పారు. మార్చి 5, 6 తేదీల్లో విశాఖలోని గీతం విశ్వవిద్యాలయం వేదికగా కెరీర్ ఫెయిర్ ఉంటుందని లోకేశ్ తెలిపారు. విశాఖలోని గీతం వర్సిటీ వేదికగా నిర్వహించే అతిపెద్ద కెరీర్ ఫెయిర్‌లో భాగస్వాములు కావాలని కోరారు. 49 అగ్రశ్రేణి ఐటీ, ఐటీ ఆధారిత కంపెనీల్లో 10వేల ఉద్యోగావకాశాలను కల్పించడమే లక్ష్యంగా ఈ కెరీర్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు 'ఎక్స్'లో పేర్కొన్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆయన గురువారం సాయంత్రం విడుదల చేశారు. ఏపీ ఉన్నత విద్యామండలి, ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థతో కలిసి నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీస్ కంపెనీస్ ఈ మేళా నిర్వహిస్తోంది. 2004, 2025 పాస్‌అవుట్ (టెక్, ఆర్ట్స్, సైన్స్, ఐటీఐ, పాలిటెక్నిక్ అండ్ డిప్లమా) విద్యార్థులు దీనికి అర్హులు. తొలుత వచ్చిన వారికి తొలి ప్రాధాన్యం ప్రాతిపదికగా ఈ కెరీర్ ఫెయిర్ సాగుతుంది. అభ్యర్థులు మార్చి 3లోగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్లు చేసుకోవాలి. భవిష్యత్తును తీర్చిదిద్దే ఈ అవకాశాన్ని యువత మిస్ చేసుకోవద్దని లోకేశ్ సూచించారు.

## మార్చి 2న ఆస్కార్ పురస్కారాల వేడుక

### లాస్ ఎంజిల్స్ వేదికగా ప్రదానోత్సవం

**న్యూయార్క్:** ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రియులంతా ఎదురుచూస్తున్న 97వ ఆస్కార్ అవార్డుల ప్రధానోత్సవం మార్చి 2న భారత కాలమానం ప్రకారం మార్చి 3న అమెరికాలోని లాస్‌ఏంజెల్స్‌లో జరగనుంది. ఎంతో ప్రతిష్టాత్మకమైన ఈ పురస్కారాన్ని సొంతం చేసుకోవటానికి పలువురు నటీనటులు, దర్శకులు పోటీపడ్డారు. 1968 తర్వాత సంగీత నేపథ్యం ఉన్న రెండు సినిమాలు వికెడ్, ఎమిలియా పెరెజ్ ఆస్కార్‌కు నామినేట్ అయ్యాయి. ఆస్కార్ చరిత్రలో రెండు మ్యూజికల్ బ్యాక్‌డ్రాప్ ఉన్న చిత్రాలు 10 లేదా అంత కంటే ఎక్కువ కేటగిరీల్లో నామినేట్ కావటం ఇది రెండోసారి. మొత్తం నామినేషన్లలో రేసులో ఎమిలియా పెరెజ్ 13 విభాగాల్లో ముందంజలో ఉంది. ఉత్తమ దర్శకుడు, రచనా విభాగంలో నామినేట్ కాకుండా 10 కేటగిరీల్లో నామినేషన్లు అందుకున్న మొదటి చిత్రంగా వికెడ్ రికార్డు సృష్టించింది. ఎమిలియా పెరెజ్ సినిమాను జాక్వెస్ ఆడియార్డ్ తెరకెక్కించారు. పరిస్థితుల కారణంగా ట్రాన్స్‌జెండర్‌గా మారిన ఓ డ్రగ్స్ లార్డ్ అనుభవాల్ని తెరపై కళ్లకు కట్టినట్లుగా చూపించటంలో ఆయన విజయవంతం కావటంతో దర్శకుడి విభాగంలో ఆయన నామినేట్ అయ్యారు. హాలీవుడ్ నటి కర్లా సోఫియాగాస్కాన్ ఉత్తమ నటిగా నామినేషన్ దక్కించుకున్నారు. అండర్ వరల్డ్ డ్రగ్స్ నేపథ్యంలో సాగే 'ఎమిలియా పెరెజ్' చిత్రానికిగాను ఆమె ఈ అవకాశాన్ని దక్కించుకున్నారు. ఈ ఏడాది ఆస్కార్ బరిలో నిలిచిన మొదటి ట్రాన్స్‌జెండర్ కూడా ఆమె. ఫెర్నాండా టోర్రెస్ నటించిన ఐయామ్ స్టిల్ హియర్ నామినేషన్ దక్కించుకున్నారు. ఫెర్నాండా టోర్రె-స్ కూడా పోటీపడుతున్నారు. ఉత్తమ సహాయనటుడి విభాగంలో కిరెన్ కల్కిన్ (ది రియల్ పెయిన్), జెరీమీ స్ట్రాంగ్ (ది అప్రెంటిస్) ఇదే మొట్టమొదటి ఆస్కార్ నామినేషన్.

## నేడు కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ మీనాక్షి రాక

**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల నూతన బాధ్యురాలుగా నిమితులైన మీనాక్షి నటరాజన్ శుక్రవారం హైదరాబాద్ రానున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఇకపై బ్యానర్లు, కటౌట్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయవద్దని ఆ పార్టీ నేతలతోపాటు కేడర్‌ను ఆదేశించింది. ఆమె నియామకం ఖరారు అయిన తర్వాత... తొలిసారిగా శుక్రవారం హైదరాబాద్ వస్తున్నారు. దీంతో ఆమెకు స్వాగతం పలికేందుకు పార్టీలోని నేతలంతా సమాయత్తమవుతోన్నారు. మీనాక్షి నటరాజన్.. హైదరాబాద్ వస్తున్న సందర్భంగా భారీ ఫ్లెక్సీలు, కటౌట్లు, బ్యానర్లు ఏర్పాటు చేయవద్దని.. అలాగే శాలువాలు, బోకేలు తీసుకు రావద్దంటూ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పార్టీ శ్రేణులను ఆదేశించారు. గాంధీ భవన్ ఆవరణలో పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీతోపాటు రాహుల్ గాంధఈ ఫొటోలు మాత్రమే ఉండాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో గాంధీ భవన్ ఆవరణలో ఉన్న ఇతర నేతల ఫొటోలు, కటౌట్లను సిబ్బంది తొలగించారు. ఇక మీనాక్షి నటరాజన్ రాకతో గాంధ భవన్ రూపు రేఖలు మారనున్నాయనే ఓ చర్చ సైతం ప్రారంభమైంది. మరోవైపు నేడు గాంధీ భవన్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి మీనాక్షి నటరాజన్ హాజరుకానున్నారు. అలాగే పార్టీకి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతోపాటు సీనియర్లు సైతం హాజరు కానున్నారు.

# సోమేశ్వర స్వామి ప్రత్యేక పూజల్లో మాజీ కార్పొరేటర్ సాయిబాబా



స్వామివారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ సాయిబాబా



అన్నసమారాధన నిర్వహిస్తున్న సాయిబాబా

## సాయిబాబా ఆధ్వర్యంలో భక్తులకు అన్న సమారాధన

**ఈ-కబురు,శేరిలింగంపల్లి :** శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని నల్లగండ్ల గ్రామంలో గల శ్రీ సోమేశ్వర స్వామి దేవాలయంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉపవాస దీక్షలు చేపట్టిన భక్తులకు గురువారం దీక్షా విరమణ సందర్భంగా అన్న సమారాధన నిర్వహించారు. అంతకుముందు సోమేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ కార్పొరేటర్ సాయిబాబాను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నల్లగండ్ల సోమేశ్వర స్వామి ప్రత్యేక పూజల్లో పాల్గొనడం తన అదృష్టం అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని పరమశివుడిని కోరుకున్నట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం శివరాత్రి సందర్భంగా ఉపవాస దీక్షలు ఉండే భక్తులకు మరుసటి రోజు దీక్ష విరమణ కోసం అన్న సమారాధన చేపడుతామని, అదే క్రమంలో ఈ సంవత్సరం సైతం దాదాపు 1500 మంది భక్తులకు అన్న సమారాధన చేపట్టినట్లు తెలిపారు ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులతో కలిసి భక్తులకు సాయిబాబా స్వయంగా భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, శ్రీ సోమేశ్వర స్వామి దేవస్థానం ఈడి విజయ భారతి, ఆలయ అర్చకులు సంగమేష్, నాయకులు చెన్నం రాజు, భిక్షపతి, యాదగిరి, నారాయణ, నరేష్ సింగ్, విజయందర్ రెడ్డి, గిరి, శివ కుమార్, బాలరాజు, శ్రీనివాస్ రెడ్డి, శివ కుమార్, సందీప్, రవి తదితరులు పాల్గొన్నారు

# పూర్తయిన కొత్తకుంట చెరువు సుందరీకరణ



సుందరీకరణ అనంతరం కొత్తకుంట చెరువు



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్

## ప్రారంభించిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్

### చెరువుల సంరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత : ఎమ్మెల్యే గాంధీ

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :** శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని హాఫీజ్ పేట్ డివిజన్ కొత్తకుంట చెరువు సుందరీకరణ పూర్తయింది. జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో జెన్ ప్యాక్ట్, యునైటెడ్ వే సాఫ్ట్వేర్ సంస్థల సిఎస్ఆర్ ఫండ్స్ తో కొత్తకుంట చెరువును పూర్తిగా సుందరీకరించారు. చెరువు సుందరీకరణ పూర్తికావడంతో గురువారం తెలంగాణ పిఏసి చైర్మన్, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, మాదాపూర్ డివిజన్ కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్ లు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ సాఫ్ట్వేర్ సంస్థలు ముందుకు వచ్చి చెరువు సుందరీకరణకు పూనుకోవడం అభినందనీయమని, అభివృద్ధి పనులతో కొత్తకుంట చెరువు దశాదిశా మారాయని అన్నారు. పరిసర ప్రాంత ప్రజలు ఎన్నో ఏళ్లుగా పడుతున్న ఇబ్బందులకు నేటితో శాశ్వత పరిష్కారం లభించిందని తెలిపారు. గతంలో మురికి కూపంగా ఉన్న చెరువు నేడు స్వచ్ఛమైన నీటితో కొత్త శోభను సంతరించుకుందని అన్నారు. సుందరీకరణ చేపట్టిన చెరువును, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవలసిన బాధ్యత స్థానికులపై ఉందన్నారు. చెరువుల సంరక్షణ ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. చెరువులను మనం కాపాడితే చెరువులు మనల్ని కాపాడుతాయాని అన్నారు. అభివృద్ధి ఎంత చేసినా జలవనరులను కాపాడుకోకపోతే పరిస్థితి ఏ విధంగా ఉంటుందో బెంగళూరు నగరాన్ని చూస్తే అర్థమవుతుందని అన్నారు. రానున్న వర్షాకాలంలో ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టుకోవాలని స్థానికులకు సూచించారు. ఈ సందర్భంగా చెరువు కట్టపై స్థానికులుతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఐటి సంస్థల ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, కాలనీల అసోసియేషన్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

## సైబరాబాద్‌లో 6గురు ఇనిస్పెక్టర్‌లు బదిలీ

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 6గురు ఇన్‌స్పెక్టర్‌లు బదిలీ అయ్యారు. కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న 6గురు సిఐలకు స్థాన చలనం కల్పిస్తూ గురువారం సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి ఉత్తర్వులు జారీ చేశారు. కమిషనరేట్ పరిధిలోని చేవెళ్ల డిఐగా పనిచేస్తున్న రామేష్ నాయుడు మియాపూర్ డిఐగా బదిలీ అయ్యారు. సైబరాబాద్‌లో వీఆర్ లో ఉన్న ఉపేందర్ చేవెళ్ల డిఐగా ట్రాన్స్‌ఫర్ అయ్యారు. ఆర్‌సీపురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇనిస్పెక్టర్‌గా ఉన్న పవన్‌కుమార్ ఆర్‌జిఐఏ డిఐగా, సైబరాబాద్ పోలీస్ కంట్రోల్ రూంలో విధులు నిర్వహిస్తున్న విద్యాసాగర్‌రెడ్డి ఆర్‌సీపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ అయ్యారు. సైబరాబాద్ లో వీఆర్ లో ఉన్న రాజేష్ నార్సింగి డిఐగా, వీఆర్‌లో ఉన్న సుధీర్‌కుమార్ పోలీస్ కంట్రోల్ రూంకి బదిలీ అయ్యారు.

## గూగుల్‌లో ఉద్యోగుల తొలగింపు

**న్యూఢిల్లీ:** ప్రముఖ టెక్ కంపెనీ గూగుల్ తాజాగా ఉద్యోగుల తొలగింపు ప్రక్రియ చేపట్టింది. క్లౌడ్ డివిజన్‌లోని ఉద్యోగుల సంఖ్యను తగ్గించిందని సమాచారం. సంబంధిత వ్యక్తులు ఈవిషయాన్ని వెల్లడించినట్లు బ్లూమ్‌బర్గ్ తన కథనంలో పేర్కొంది. అయితే ఎంతమందిని తొలగించిందనే విషయం మాత్రం తెలియరాలేదు. వంద మందికి పైగా ఉండొచ్చని, అది కూడా కొన్ని టీమ్స్‌పై మాత్రమే తొలగింపుల ప్రభావం ఉందని తెలుస్తోంది. ఇదంతా కూడా ఖర్చు తగ్గించుకునే ప్రయత్నంలో భాగమని అంటున్నరు. కంపెనీ దీర్ఘకాలిక విజయాల కోసం వ్యాపారానికి కీలకమైన రంగాల్లో పెట్టుబడులు పెంచేందుకు సంస్థ ప్రయత్నిస్తోంది. అందులోభాగంగా కొన్ని మార్పులు చేస్తున్నామని గూగుల్ అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు. కస్టమర్ల అవసరాలకు అనుగుణంగా రానున్న రోజుల్లో అవకాశాల్ని అందిపుచ్చుకొనేందుకు అనేక సర్దుబాట్లు చేశామని వెల్లడించారు. మరోవైపు ఇటీవల త్రైమాసిక ఫలితాల్లో గూగుల్ తన క్లౌడ్ వ్యాపారంలో ఆదాయ అంచనాలను అందుకోలేకపోయింది. 2025 మూలధన వ్యయాలు కూడా అంచనాలకు మించిపోయాయి. ఈనేపథ్యంలో ఉద్యోగుల సంఖ్యను తగ్గించడం గమనార్హం.

## జైలు సెల్‌లో ఒంటరిగా ఉండలేను

**విజయవాడ:** వైకాపా నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ 3 రోజుల పోలీసు కస్టడీ ముగియడంతో విజయవాడ కోర్టులో హాజరుపర్చారు. ఈ సందర్భంగా వంశీ కోర్టులో కీలక వ్యాఖ్యలు చేశారు. జైలులోని సెల్‌లో తనను ఒంటరిగా ఉంచారని న్యాయమూర్తి దృష్టికి తెచ్చారు. తనకు ఆస్తమా సమస్య ఉందని, ఆరోగ్య సమస్య వస్తే ఇబ్బందని తెలిపారు. తనతో పాటు సెల్‌లో మరొకరిని ఉంచాలని, భద్రతా పరంగా తనకు ఇబ్బంది లేదని కోర్టును కోరారు. ఇప్పటికే వంశీకి దగ్గరలో అటెండర్ సౌకర్యం కల్పించారు కదా అని న్యాయమూర్తి అడిగారు. సెల్‌లో మరొకరిని ఉంచేందుకు ఇన్‌ఛార్జి జడ్జిగా తాను ఆదేశించలేనని న్యాయమూర్తి తెలిపారు. సెల్‌లో ఏమైనా జరిగితే అధికారులు బాధ్యత వహించాల్సి వస్తుందని న్యాయమూర్తి వ్యాఖ్యానించినట్లు సమాచారం. సెల్ మార్పు కోసం శుక్రవారం రెగ్యులర్ కోర్టులో మెమో దాఖలు చేయాలని వంశీ తరఫు న్యాయవాదికి సూచించారు. సెల్ వద్ద వార్డెన్‌ను ఉంచాలని జైలు సూపరింటెండెంట్‌కు ఆదేశాలు జారీ చేశారు. వంశీ భద్రత దృష్ట్యా సెల్‌లో ఒంటరిగా ఉంచామని ప్రభుత్వ న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. ఆరోగ్య పరిశీలనకు వార్డెన్‌ను ఏర్పాటు చేసేందుకు అభ్యంతరం లేదని తెలిపారు. అనంతరం విజయవాడ జిల్లా జైలుకు తరలించారు. సత్యవర్ధన్‌ను బెదిరించి కేసు తారుమారు చేయాలని చూశారని విజయవాడ సెంట్రల్ ఏసీపీ దామోదర్ తెలిపారు. వంశీ, అతని అనుచరులు సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసినట్లు ఆధారాలు ఉన్నాయన్నారు. సీసీ కెమెరా ఫుటేజీ, సాంకేతిక ఆధారాలు సేకరించాం. కోర్టు ఆదేశాలతో వంశీని 3 రోజులు ప్రశ్నించాం. కొన్నింటికి ఔనని.. మరి కొన్ని ప్రశ్నలకు జవాబివ్వలేదు. కనిపించని ఫోన్ గురించి అడిగితే తెలియదన్నారు.

# రాహుల్ గాంధీతో సమావేశంలో పాల్గొన్న సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగర



రాహుల్ గాంధీకి జ్ఞాపికను అందజేస్తున్న సాల్ట్ మేకర్స్ ఫెడరేషన్



సమావేశంలో పాల్గొన్న సగర సంఘం అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగర

## సగరుల సమస్యలపై రాహుల్ గాంధీకి వినతిపత్రం

ఈ-కబురు, శేరిలింగంపల్లి : దేశ రాజధాని న్యూఢిల్లీలో లోక్ సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాహుల్ గాంధీతో సాల్ట్ మేకర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిపిన సమావేశంలో తెలంగాణ రాష్ట్ర సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సాగర పాల్గొన్నారు. దాదాపు గంట పది నిమిషాల పాటు రాహుల్ గాంధీతో చర్చలు జరిపారు. దేశవ్యాప్తంగా ఉన్న భగీరథుని వారసులు వివిధ రాష్ట్రాలలో వివిధ పేర్లతో పిలువబడే సగర (ఉప్పర)ల ఆర్థిక, విద్య, ఉపాధి, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో స్థితిగతులపై సుదీర్ఘంగా చర్చించారు. ఆల్ ఇండియా సాల్ట్ మేకర్స్ ఫెడరేషన్ సంయుక్త కార్యదర్శి ఓంప్రకాష్ మహతో ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాలకు చెందిన 11 మంది ప్రతినిధులు రాహుల్ గాంధీతో సమావేశమయ్యారు. సగరులు అన్ని రంగాలలో ముందడుగు వేసే క్రమంలో సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు అవసరమైతే పార్లమెంటులో సమస్యలను లేవనెత్తుతానని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారని శేఖర్ సాగర్ తెలిపారు. రాబోయే అన్ని ఎన్నికలలో దేశవ్యాప్తంగా ఉన్న సగరులకు రాజకీయంగా కాంగ్రెస్ పార్టీలో సముచిత అవకాశాలను కల్పిస్తానని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారన్నారు. తెలంగాణలో సగరులను బిసి 'డి' నుంచి 'ఏ' లోకి మార్చాలని, ఫెడరేషన్ ను కార్పొరేషన్ గా మార్చి నిధులు కేటాయించాలని, 59 జీవోను సవరణ చేసి సగరులకు ప్రభుత్వ కాంట్రాక్టు పనులలో రిజర్వేషన్ సంఖ్య పెంచాలని, కార్మిక సంక్షేమ మండలి చైర్మన్ పదవి సగరులకు ఇవ్వాలని కోరుతూ రాహుల్ గాంధీకి వినతి పత్రాన్ని అందజేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన రాహుల్ గాంధీ సానుకూలంగా స్పందించారని, సగరుల న్యాయమైన కోరికలను నెరవేర్చేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సూచిస్తానని హామీ ఇచ్చారని అన్నారు.

# స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు





### నేలచూపులు చూస్తున్న కొనుగోలుదారులు

### ధరల పెరుగుదలతో సామాన్యులకు అందుబాటులో లేని గోల్డ్

**న్యూఢిల్లీ:** బంగారం ప్రియులకు స్వల్ప ఊరట లభించింది. ఫిబ్రవరి నెల ప్రారంభం నుంచి భారీగా పెరిగాయి. అంతర్జాతీయంగా బంగారం ధరల్లో వృద్ధి చెందటం, ఆర్థిక సంక్షోభం, డాలర్ మారకంలో వచ్చిన మార్పులు లాంటి కారణాలు ఈ ధరల పెరుగుదలకు కారణమయ్యాయి. ఇక ఇప్పుడు గత రెండు రోజులుగా గోల్డ్ రేట్స్.. నేలచూపులు చూస్తున్నాయి. 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారంపై రూ. 280 మేరకు తగ్గగా.. 22 క్యారెట్ల బంగారం రూ. 260 మేరకు తగ్గింది. అటు వెండి ధరలు కూడా బంగారం బాట పట్టాయి. రెండు రోజుల్లో సుమారు రూ. 3100 మేరకు తగ్గింది. అయితే ధరలు పెరిగినప్పుడు ఉన్న దూకుడు తగ్గుదలలో మాత్రం కానరావడం లేదు. దీంతో సామాన్య ప్రజలు బంగారం వైపు చూడడం మానేశారు. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ. 87,810 ఉండగా.. 22 క్యారెట్ల తులం బంగారం రూ. 80,490గా ఉంది. అలాగే విజయవాడలో 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం రూ. 87,810 ఉండగా.. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ. 80,490 వద్ద కొనసాగుతోంది. వెండి ధరల విషయాని కొస్తే.. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలో కేజీ వెండి ధర రూ. 1,05,900గా ఉంది. చెన్నైలో కూడా ఇదే రేటు కొనసాగుతోంది. అటు ముంబై, ఢిల్లీ, కోల్‌కతాలో కిలో వెండి రూ. 97,900గా ఉంది. పేద, సామాన్యులకు బంగారం ధరలు అందుబాటులో లేకుండా పోవడంతో పసిడికి డిమాండ్ పడిపోతోంది. దీంతో దిగుమతులు సగానికి తగ్గనున్నాయని రిపోర్టులు వస్తోన్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో బంగారం దిగుమతులు 15 టన్నులకు పరిమితం కానుందని రాయిటర్స్ ఓ రిపోర్ట్‌లో పేర్కొంది. ఏడాది క్రితం నాటి దిగుమతులతో పోల్చితే 85 శాతం క్షీణించి.. 20 ఏళ్ల నాటి కనిష్ట స్థాయికి పడిపోవచ్చని అంచనా వేసింది. ఈ ఏడాది జనవరిలోని 30-35 టన్నుల దిగుమతులతో పోల్చితే దాదాపుగా సగానికి క్షీణించొచ్చని విశ్లేషించింది. అంతర్జాతీయ బులియన్ మార్కెట్‌లో సోమవారం ఔన్స్ ధర రికార్డ్ స్థాయిలో 2,956 డాలర్లకు ఎగిసింది. అధిక ధరల కారణంగా డిమాండ్ భారీగా తగ్గింది. అమెరికా వాణిజ్య సుంకాల దాడికి తోడు ప్రపంచ ఆర్థిక అనిశ్చితి, భౌగోళిక ఆందోళనలు బంగారం ధరలకు ఆజ్యం పోస్తున్నాయి. వీటికి తోడు డాలర్‌తో రూపాయి మారకం విలువ భారీగా క్షీణించి పసిడి ధరలను ఎగిసిపడేలా చేస్తోన్నాయి. 2025 జనవరిలో బంగారం దిగుమతులు 30-35 టన్నులకు పడిపోయి.. ఆరు నెలల కనిష్ట స్థాయి వద్ద నమోద య్యాయని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ప్రస్తుత నెలలో డిమాండ్ మరింత సన్నగిల్లిందని మార్కెట్ నిపుణులు పేర్కొన్నారు. దేశీయంగా డిమాండ్ తక్కువగా ఉండటం, రికార్డు స్థాయిలో పెరిగిన ధరల కారణంగా ఈ నెలలో బంగారం దిగుమతులు 50 శాతం తగ్గొచ్చన్నారు. దేశంలో వివాహాల సీజన్ కొనసాగు తున్నప్పటికీ డిమాండ్ తక్కువగానే ఉందన్నారు. ధరలు పెరగక ముందు కొన్ని బ్యాంక్‌లు దిగుమతి చేసుకున్న బంగారాన్ని తిరిగి అమెరికాకు పంపిస్తున్నాయన్నారు. దీంతో అధిక రాబడులను పొందుతున్నా యన్నారు. భారత్‌లోని ఆభరణాల తయారీదారుల కోసం టోకుగా ఒక్క ఔన్స్‌పై 23 డాలర్ల తగ్గింపును అందిస్తోన్నాయన్నారు. గతేడాది దీర్ఘకాలంగా అస్థిరంగా ఉన్న ధరలు.. నవంబర్‌లో అకస్మాత్తుగా తగ్గినప్పటికీ.. తిరిగి ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత బంగారం ధరలకు రెక్కలు వచ్చాయి. ట్రంప్‌తో ప్రపంచ దేశాల్లో అనిశ్చిత్తి నెలకొనడంతో సురక్షిత పెట్టుబడి కోసం బంగారంపై సెంట్రల్ బ్యాంక్‌లు, బులియన్ వర్తకులు పెట్టుబడులు పెంచారు. దీంతో రెండు, మూడు నెలల్లోనే బంగారం ధరలు 14 శాతం మేర పెరిగాయి. దేశీయంగా బుధవారం 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ. 270 తగ్గి రూ. 87,970 వద్ద నమోదయ్యింది. 22 క్యారెట్ల ధర రూ. 250 తగ్గి రూ. 80,650 వద్ద ముగిసింది. వచ్చే నెలలో 10 గ్రాముల ధర రూ. 87,300 నుంచి 89,000 వరకు చేరొచ్చని కూడా భావిస్తున్నారు.




## పోసాని అరెస్ట్ నిరంకుశ విధానం

### తీవ్రంగా ఖండించిన వైకాపా అధినేత జగన్

**అమరావతి:** సినీ నటుడు పోసాని కృష్ణమురళి అరెస్టును వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ ఖండించారు. ఏపీలో కూటమి ప్రభుత్వ పాలన నిరంకుశంగా సాగుతోందని మండిపడ్డారు. అరెస్ట్ నేపథ్యంలో పోసాని భార్య కుసుమలతను జగన్ ఫోన్‌లో పరామర్శించారు. అరెస్ట్ విషయంలో పోసానికి వైసీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. జరుగుతున్న వ్యవహారాలను ప్రజలు, దేవుడు చూస్తున్నారని.. కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలన్నారు. 'ఏపీలో కూటమి ప్రభుత్వ పాలన నిరంకుశంగా సాగుతోంది. అరెస్ట్ విషయంలో పోసాని కృష్ణమురళికి వైసీపీ అండగా ఉంటుంది. రాష్ట్రంలో జరుగుతున్న వ్యవహారాలను ప్రజలు, దేవుడు చూస్తున్నారు. కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలి. పోసానికి వైసీపీ పార్టీ తరుపున న్యాయ పరంగా సహాయం అందిస్తాం. పార్టీకి సంబంధించిన సీనియర్ న్యాయవాదులతో లీగల్ గా ముందుకు వెళ్తామని వైఎస్ జగన్ పేర్కొన్నారు. పోసాని కృష్ణమురళిని ఏపీ పోలీసులు బుధవారం రాత్రి అరెస్టు చేశారు. ప్రస్తుతం పోసాని అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లి పోలీస్ స్టేషన్లో ఉన్నారు. ఓబులవారిపల్లి పీహెచ్సీ డాక్టర్ గురు మహేష్ ఆయనకు వైద్య పరీక్షలు చేస్తున్నారు. జనసేన రాయలసీమ జోన్ కన్వీనర్ జోగిమణి ఫిర్యాదు మేరకు పోసానిపై కేసు నమోదైంది.

## మరోమారు వక్రబుద్ధి చూపించుకున్న పాకిస్థాన్

### జెనీవా వేదికగా కాశ్మీర్ ప్రజాస్వామ్యంపై గగ్గోలు

### ధీటుగా తిప్పికొట్టిన భారత ప్రతినిధి

**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ వేదికలపై తరచూ పాకిస్థాన్ భారత్‌పై తన అక్కసు వెళ్లగక్కుతున్న పాకిస్థాన్‌కు మరోమారు భారత్ ధీటుగా బదులిచ్చింది. నోరు మూసుకునేలా చేసింది. దాని కుత్సిత బుద్ధిని బయటపెట్టింది. తాజాగా జమ్మూకశ్మీర్‌లో ప్రజాస్వామ్యం అణచివేతకు గురవుతోందని, మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందని ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలిలో దాయాది దేశం ఆరోపించింది. ఈ ఆరోపణలను భారత్ తీవ్రంగా ఖండించింది. అంతేకాక.. మాకు ఉపన్యాసాలు ఇచ్చే స్థాయిలో ఆ దేశం లేదని స్పష్టం చేసింది జెనీవాలో జరిగిన ఈ సమావేశంలో జమ్మూకశ్మీర్‌ను ఉద్దేశించి పాక్ న్యాయ, మానవ హక్కుల మంత్రి అజం నజీర్ తరార్ వ్యాఖ్యలు చేశారు. దీనిపై భారత రాయబారి క్షితిజ్ త్యాగి ధీటుగా స్పందించారు. 'కేంద్రపాలిత ప్రాంతాలైన జమ్మూకశ్మీర్, లద్దాఖ్‌లు ఎప్పుడూ భారత్‌లో అంతర్భాగమే. దశాబ్దాల తరబడి పాకిస్థాన్ ఉగ్రవాదం కారణంగా దెబ్బతిన్న ఆ ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు తెచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంది. మానవ హక్కుల ఉల్లంఘన, మైనారిటీలను హింసించడంతో సహా ప్రజాస్వామ్య విలువలను పాటించని దాయాది దేశం భారత్‌కు ఉపన్యాసాలు ఇచ్చే స్థాయిలో లేదు. ఆ దేశ వాక్చాతుర్యంలోనే కపటత్వం కన్పిస్తోంది. ఐరాస జాబితాలోని పలు ఉగ్రవాద సంస్థలకు ఆ దేశం ఆశ్రయం కల్పిస్తుంది. ప్రజాస్వామ్య పురోగతి, ప్రజలకు గౌరవం కల్పించడం వంటి వాటిపై భారత్ దృష్టిసారిస్తుంది. ఆ దేశం మాపై ఆరోపణలు చేయడం మానేసి.. తమ దేశంలోని ప్రజలకు సుపరిపాలనను అందించడంపై దృష్టిపెట్టాలి' అని త్యాగి పేర్కొన్నారు. ఇక, ఇటీవల చైనా అధ్యక్షతన జరిగిన భద్రతామండలి సమావేశంలోనూ పాకిస్థాన్ విదేశాంగ మంత్రి మహమ్మద్ ఇషక్ దార్ జమ్మూకశ్మీర్ అంశాన్ని లేవనెత్తారు. దీనికి సైతం భారత్ ఘాటుగా స్పందించింది. జైషే మహమ్మద్ వంటి సంస్థలను ప్రోత్సహించే పాక్.. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్నామని చెప్పడం అత్యంత హాస్యాస్పదమని ఆగ్రహం వ్యక్తంచేసింది. ముందుగా దీనిని సరిదిద్దుకోవాలని సూచించింది.

## ఓబులవారిపల్లె పీఎస్‌కు పోసాని తరలింపు

**మదనపల్లె:** వైకాపా (జాఖీఅఖ) నేత, సినీనటుడు పోసాని కృష్ణమురళి ని పోలీసులు అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె పీఎస్‌కు తీసుకొచ్చారు. హైదరాబాద్‌లోని రాయదుర్గంలో మైహోమ్ భూజాలో అదుపులోకి తీసుకున్న తర్వాత నేరుగా ఇక్కడికి తీసుకొచ్చారు. పోలీస్‌స్టేషన్‌లోనే ప్రభుత్వ వైద్యుడు గురుమహేశ్ ఆధ్వర్యంలో పోసానికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఆయన స్టేట్‌మెంట్‌ను రైల్వేకోడూరు సీఐ వెంకటేశ్వర్లు నమోదు చేశారు. పోసాని కృష్ణమురళినిరైల్వేకోడూరు కోర్టులో హాజరు పరిచే అవకాశముంది. సినీ పరిశ్రమలో వర్గవిభేదాలు తలెత్తేలా, ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై పోసాని అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ జనసేన నేత జోగినేని మణి రెండు రోజుల క్రితం ఇచ్చిన ఫిర్యాదుపై ఓబులవారి పల్లె పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. వర్గాల మధ్య విభేదాలు రెచ్చగొట్టడం, తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడం, వ్యవస్థీకృత నేరానికి పాల్పడడం వంటి అభియోగాలపై బీఎన్ఎస్‌లోని 196, 353(2), 111 రెడ్‌విత్ 3(5) సెక్షన్ల కేసు నమోదైంది.

# నేడు అసెంబ్లీ ముందుకు ఎపి బడ్జెట్

**అమరావతి:** ఏపీ బ్జడెట్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది. 28న శుక్రవారం ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ తన తొలి బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశ పెట్టనున్నారు. ఇప్పటికే వివిధ శాఖలతో ఆయన సమీక్షించారు. తొలి పూర్తిస్థాయి బడ్జెట్ కావడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ బడ్జెట్‌కు ముఖ్య లక్ష్యం రాష్ట్ర వృద్ధి రేటు 15 శాతం సాధించడం, 2.4 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చెందడమే. ఇందుకోసం మూలధన వ్యయాన్ని పెంచుతూ, దీర్ఘకాలిక ప్రణాళికలతో ముందుకు వెళ్లాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇకపోతే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను ముందుకు తీసుకుని వెళ్లాల్సి ఉంది. అలాగే హామీలను అమలు చేస్తామని సిఎం చంద్రబాబు కూడా ప్రకటించారు. పట్టణ పునరుద్ధరణ ప్రాజెక్టులు, మెరుగైన రహదారి కనెక్టివిటీ, పరిశ్రమల వృద్ధి, పునరుత్పత్తి శక్తి రంగాల్లో పెట్టుబడులు బ్జడెట్‌లో ముఖ్య ప్రాధాన్యత పొందనున్నాయి. ముఖ్యంగా డిజిటల్ గవర్నెన్స్,



ఐటీ హబ్‌ల అభివృద్ధి, తయారీ పరిశ్రమల వృద్ధి తదితర రంగాల్లో ప్రత్యేక నిధులు కేటాయించే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వ పథకాలతో సమన్వయం చేసుకుంటూ, రాష్ట్ర బడ్జెట్‌లో విద్య, ఆరోగ్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వనున్నారు. పాఠశాలల మౌలిక సదుపాయాల మెరుగుదల, ఉచిత ఆరోగ్య సంరక్షణ పథకాలు, గ్రామీణ ఆరోగ్య కేంద్రాల బలోపేతం అన్నవి ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. తమ పథకాల అమలుకు తగినంత నిధులు కేటాయించడమే కాకుండా, వాటి ఆర్థిక ప్రభావాన్ని సమీక్షించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. ముఖ్యంగా సూపర్ సిక్స్ పథకాల అమలుకు పెద్దపీట వేస్తోంది. సూపర్ సిక్స్ పథకాల్లో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, దీపం 2.0, సామాజిక భద్రతా పెన్షన్లు, అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణ కీలకమైనవి. వీటిలో కొన్నింటిని ఇప్పటికే అమలు చేస్తున్నారు. మరికొన్నింటిని త్వరలోనే అమలు చేస్తామని ప్రకటించారు. ఈ హామీల అమలుకు భారీగా నిధులు కేటాయించాల్సి ఉంటుంది. రాష్ట్రంలో ఆర్థిక లోటు ఉన్నా, సంక్షేమ పథకాలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

### తెలుగు రాష్ట్రాల్లో ముగిసిన ఎమ్మెల్సీ పోలింగ్

**హైదరాబాద్:** తెలుగు రాష్ట్రాల్లో ఆరు ఎమ్మెల్సీ స్థానాలకు గురువారం జరిగిన పోలింగ్ పక్రియ ముగిసింది. ఆంధ్రప్రదేశ్ లో 3, తెలంగాణలో 3 ఎమ్మెల్సీ స్థానాలకు పోలింగ్ జరిగింది. అయితే, సాయంత్రం 4 గంటల వరకు క్యూ లైన్లలో ఉన్న వారికి ఓటు వేసే అవకాశం కల్పించారు. ఏపీలో 2 గ్రాడ్యుయేట్, ఒక టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికలు జరిగాయి. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పోలింగ్ సమయం ముగిసే నాటికి పశ్చిమ గోదావరి జిల్లాలో 65.43 శాతం నమోదు అయినట్లు అధికారులు తెలిపారు. దీంతో పాటు టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విశాఖపట్నం జిల్లాలో 87.30 శాతం పోలింగ్ నమోదు అయింది. ఎన్‌టీఆర్ జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ముగిసే సమయానికి 61.99 శాతం నమోదు అయింది. మరోవైపు, తెలంగాణలోని మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ ముగిసింది. ఉమ్మడి కరీంనగర్-మెదక్-నిజామాబాద్- ఆదిలాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి 40.61 శాతం, ఇవే జిల్లాల్లో జరుగుతున్న టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి 63.49 శాతం పోలింగ్ నమోదు కాగా, వరంగల్- నల్లగొండ- ఖమ్మం టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి 76.35 శాతం పోలింగ్ నమోదు అయినట్లు తెలిపారు. కాగా, వచ్చే నెల 3వ తేదీన తుది ఫలితాలను ఎన్నికల కమిషన్ వెల్లడించనుంది.

### నేడు ఎపి కేబినేట్ భేటీ

**అమరావతి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీలో 2025-26వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ ను చంద్రబాబు సర్కార్ ప్రవేశ పెట్టనుంది. ఎన్నికలు ముగిసిన తర్వాత పూర్తి స్థాయిలో ఈ బడ్జెట్ ప్రవేశ పెట్టనుంది. ఇందులో భాగంగా శు క్రవారం జరిగే కేబినేట్ సమావేశం బడ్జెట్‌కు లాంఛనంగా ఆమోదం తెలుపనుంది. ఈ మేరకు ఉదయం 9 గంటలకు ఏపీ కేబినేట్ సమావేశం జరగనుంది. ఈ మంత్రి మండలి సమావేశంలో దీనికి ఆమోదం తెలువుతుంది. ఆ తర్వాత ఉదయం 10 గంటలకు శాసన సభలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ ప్రవేశ పెట్టనున్నారు. వ్యవసాయ బడ్జెట్‌ను మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రవేశ పెట్టనున్నారు. కౌన్సిల్ లో మంత్రి కొల్లు రవీంద్ర బడ్జెట్ ను ప్రవేశ పెట్టనుండగా.. వ్యవసాయ బ్జడెట్ ను మంత్రి పొంగూరు నారాయణ ప్రవేశ పెట్టనున్నారు.

### కొమరవోలు గ్రామస్థులతో బాలయ్య దురుసు ప్రవర్తన

**విజయవాడ:** కృష్ణా జిల్లాలోని తన స్వగ్రామం నిమ్మకూరులో సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా కొమరవోలు గ్రామస్థులు బాలకృష్ణతో ఫొటోలు దిగేందుకు ఎగబడగా.. వారిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ సమయంలోనే ' మా గ్రామాన్ని పట్టించుకోరా' అని ఆ గ్రామస్తులు ప్రశ్నించగా.. దీనిపై బాలకృష్ణ మాట్లాడుతూ.. పట్టించుకోను.. ఫోటోలు దిగారుగా.. ఇక వెళ్ళండి అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొమరవోలు గ్రామమా అదెక్కడ అని వ్యంగంగా మాట్లాడారు. కొమరవోలు గ్రామానికి ఈ జన్మలో రాను. వాళ్లు లింగాయత్తులు.. వాళ్లను పట్టించుకోవాల్సిన అవసరం లేదు అని వ్యంగాస్త్రాలు సందించారు. అయితే, బాలకృష్ణ మాతృమూర్తి బసవతారకం స్వగ్రామం కొమరవోలు గ్రామమే. తన కన్నతల్లి స్వగ్రామస్తులపైనే బాలకృష్ణ మండిపడడం హాట్ టాపిక్ అయింది. బాలకృష్ణ తీరుపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

### భవన నిర్మాణాలకు మార్గదర్శకాలు జారీ

**అమరావతి:** రాష్ట్రంలో అనధికార, అక్రమ నిర్మాణాలకు సంబంధించి పురపాలకశాఖ మార్గదర్శకాలను విడుదల చేసింది. అన్ని రాష్ట్రాలకు ఇటీవల సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాలతో తాజా మార్గదర్శకాలు జారీ అయ్యాయి. ఈమేరకు పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి సురేష్ కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆక్యుపేషన్ సర్టిఫికెట్‌పై భవన యజమానుల వద్ద అండర్ టేకింగ్ తీసుకోవాల్సి ఉంటుంది. ఆక్యుపేషన్ సర్టిఫికెట్ ఉంటేనే భవనాల్లోకి వచ్చేలా చూడాలి. నిర్మాణం పూర్తయ్యే వరకు ప్లాన్ ప్రదర్శించేలా చర్యలు చేపట్టాలి. ఎప్పటికప్పుడు అధికారులు బిల్డింగ్ ప్లాన్, నిర్మాణాన్ని తనిఖీ చేయాలి. డీవియేషన్ సరిచేసే వరకు ఆక్యుపేషన్ సర్టిఫికెట్ ఇవ్వొద్దు. డీవియేషన్ ఉన్న నిర్మాణాలకు ఆక్యుపేషన్ సర్టిఫికెట్ ఇస్తే చర్యలు తప్పవు. నివాసయోగ్య ధ్రువపత్రం ఇస్తేనే తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలి. అక్రమ నిర్మాణాలకు ట్రేడ్, బిజినెస్ లైసెన్స్‌లు జారీ చేయొద్దన స్పష్టం చేశారు. జోనల్ ప్లాన్‌లోనూ డీవియోషన్ లేకుండా నిర్మాణాలు ఉండేలా చూడాలి. నివాసయోగ్య పత్రం చూశాకే బ్యాంకులు నిర్మాణాలపై రుణాలు ఇవ్వాలని నిర్దేశించారు.

### నేరస్థులను వదిలి..విపక్ష నేతల అరెస్ట్

**అనంతపురం:** నేరం చేసిన వారిని వదిలిపెట్టి.. ప్రతిపక్షాలను అరెస్ట్ చేసే కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చూడుతోందని హిందూపురం మాజీ ఎంపీ, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్ ఆరోపించారు. అందుకు ఈ ప్రభుత్వం మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. రాష్ట్రంలో అతి త్వరలో మీ చేష్టలు, అక్రమ కేసులకు అంతర్యుద్ధం రావడానికి ఎంతో దూరం లేదన్నారు. హిందూపురం మాజీ ఎంపి గోరంట్ల మాధవ్ నివాసానికి విజయవాడ సైబర్ క్రైమ్ పోలీసులు వెళ్లారు. ఆయనకు సెక్షన్ 35 బీఎన్ఎస్ఎస్ కింద పోలీసులు నోటీసులు అందజేశారు. మార్చి 5వ తేదీన సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌కు హాజరు కావాలని గోరంట్ల మాధవ్‌కు ఆ నోటీసుల్లో స్పష్టం చేశారు. 2024, నవంబర్ 2 తేదీన సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో మహిళా కమిషన్ మాజీ చైర్మన్ వాసిరెడ్డి పద్మ ఫిర్యాదు చేశారు. దీంతో ఆయనపై పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఓ ఇంటర్వ్యూలో ఫోక్సో కేసులో బాధితురాలి పేరు గోరంట్ల మాధవ్ చెప్పారంటూ ఆయనపై కేసు నమోదు చేశారు. విజయవాడ పోలీసులు జారీ చేసిన నోటీసులపై మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ స్పందించారు. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగానే తాను ఈ వ్యాఖ్యలు చేశానని స్పష్టం చేశారు. దీనిని కూటమి ప్రభుత్వంలోని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మైండ్‌లో పెట్టుకోవాలని సూచించారు.



## యూరప్‌పై యూఎస్ సుంకాల మోత.. ఎంతంటే..

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వచ్చీరాగానే కార్యనిర్వాహక ఉత్తర్వులను(ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లు) జారీ చేసి ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థల్లో ఆందోళనలను రేకెత్తించారు. అనుకున్న విధంగానే ప్రమాణ స్వీకారం తర్వాత వరుసగా వివిధ దేశాలపై సుంకాల మోత మోగిస్తున్నారు. తాజాగా యూరోపియన్ యూనియన్ (ఈయూ) నుంచి చేసే దిగుమతులపై 25 శాతం సుంకం విధించనున్నట్లు ట్రంప్ ప్రకటించారు. అమెరికా, ఈయూ మధ్య దీర్ఘకాలంగా కొనసాగుతున్న వాణిజ్య అసమతుల్యతను పరిష్కరించేందుకు తన ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్ల దిగుమతులపై ప్రత్యేక దృష్టి సారించి సుంకాలు విస్తృతంగా వర్తిస్తాయని ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో ట్రంప్ పేర్కొన్నారు. వాణిజ్య లోటును ప్రధాన సమస్యగా పేర్కొంటూ ఈయూ అమెరికాను వినియోగించుకుంటుందని తెలిపారు.

**సుంకాలు తొలిసారి కాదు..**

ట్రంప్ సుంకాలతో ఈయూను టార్గెట్ చేయడం ఇదేం తొలిసారి కాదు. తన మొదటి పదవీకాలంలో యూరప్ చేసుకున్న ఉక్కు, అల్యూమినియం ఎగుమతులపై సుంకాలు విధించారు. ప్రస్తుతం 'అమెరికా ఫస్ట్' అనే విధానాన్ని అనుసరిస్తున్న నేపథ్యంలో యూరప్ నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై టారిఫ్‌లు విధించాలని నిర్ణయించుకున్నారు. ఇది ఈయూతో అమెరికాకు ఉన్న అంతర్జాతీయ భాగస్వామ్యాల కంటే ఆర్థిక ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇచ్చేలా ఉందని కొందరు అభిప్రాయపడుతున్నారు.

**ఆర్థిక ప్రభావాలు**

ప్రతిపాదిత సుంకాలు గణనీయమైన ఆర్థిక ప్రభావాలను కలిగి ఉంటాయని భావిస్తున్నారు. దిగుమతి చేసుకునే ఉత్పత్తులపై అధిక టారిఫ్‌ల వల్ల స్థానికంగా యూఎస్‌లో తయారీ పరిశ్రమను పరుగులు పెట్టించే అవకాశం ఉంటుంది. లేదంటే తప్పకుండా వినియోగదారులు అవే వస్తువులు వాడాలనుకుంటే మాత్రం ధరలు పెరిగే ప్రమాదం ఉంది. ఇలా ఉత్పత్తులపై పెరిగే ఖర్చులు ద్రవ్యోల్బణాన్ని పెంచుతాయని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు. కొత్త టారిఫ్‌లపై 'గట్టిగా, వెంటనే' ప్రతిస్పందిస్తామని యూరోపియన్ కమిషన్ హెచ్చరించింది. స్వీడన్ మాజీ ప్రధాని కార్ల్ బిల్డ్ ట్రంప్ అభిప్రాయాన్ని తప్పుబట్టారు.

## ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలు

### ఆరు స్థానాలకు ఉదయం పోలింగ్ ప్రారంభం

### 3న కౌంటింగ్...ఫలితాల ప్రకటన

హైదరాబాద్/విజయవాడ: తెలుగు రాష్ట్రాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ఉదయం 8గంటలకు ప్రారంభమైంది. ఉపాధ్యాయ, పట్టభద్రుల స్థానాల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. ఏపీ, తెలంగాణల్లో మూడు చొప్పున 6 స్థానాల్లో గురువారం ఉదయం ప్రారంభమైన పోలింగ్.. సాయంత్రం 4 గంటల వరకు కొనసాగనుంది. ఏపీలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ, ఉభయగోదావరి, కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. 16 జిల్లాల పరిధిలోని 1,062 కేంద్రాల్లో పోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ మూడు నియోజకవర్గాల పరిధిలో 70 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. 6,84,593 మంది ఓటర్లు ఉన్నారు. పోలింగ్ ముగిసే సమయానికి కేంద్రం లోపల క్యూలైన్లో ఉన్నవారందరికీ ఓటేసే అవకాశం కల్పిస్తారు. పోలింగ్ కోసం ఎన్నికల సంఘం పటిష్ఠ ఏర్పాట్లు చేసింది. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ స్థానంలో 10 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. వీరిలో పాకలపాటి రఘువర్మ (ఏపీటీఎఫ్), గాదె శ్రీనివాసులునాయుడు (పీఆర్‌టీయూ), విజయగౌరి (యూటీఎఫ్) మధ్య ప్రధాన పోటీ నెలకొంది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల స్థానం బరిలో 35 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. వీరిలో ప్రధానంగా రాజశేఖరం (కూటమి) రాఘవులు (పీడీఎఫ్) మధ్య పోటీ ఏర్పడింది. ఉమ్మడి కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం బరిలో 25 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. వీరిలో ఆలపాటి రాజేంద ప్రసాద్ (కూటమి) కేఎస్ లక్ష్మణరావు (పీడీఎఫ్) మధ్య ప్రధాన పోటీ నెలకొంది. తెలంగాణలో ఉమ్మడి మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గంతోపాటు ఉపాధ్యాయ నియోజకవర్గం, ఉమ్మడి వరంగల్-ఖమ్మం-నల్గొండ జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గాలకు కలిపి 90 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. మూడు స్థానాల్లో ఓటింగ్ కోసం 973 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మార్చి 3న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

## గ్రామ సచివాలయాల్లో మిగులు సిబ్బంది గుర్తింపు

**అమరావతి:** స్వర్ణాంధ్ర విజన్ -2047 అమలు దిశలో రాష్ట్రప్రభుత్వం జోరుగా కసరత్తు చేస్తోంది. దీనిలో భాగంగా ఇప్పటికే గ్రామ, వార్డు సచివాలయాల్లో మిగులు సిబ్బందిని గుర్తించింది. వీరిని క్షేత్రస్థాయిలో విజన్ అమలు యంత్రాంగంగా వినియోగించుకోవాల ని భావిస్తోంది. ఎక్కడ అవసరమో అక్కడ పనిచేయించడం లక్ష్యంగా కసరత్తు చేస్తున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా 15,498 మందిని మిగులు ఉద్యోగులు ఉన్నట్లు ప్రభుత్వం లెక్కలు తేల్చింది. ఇందులో గ్రామ సచివాలయాల్లో 12,126 మంది, వార్డు సచివాలయాల్లో 3,372మంది మిగులు ఉద్యోగులు ఉన్నట్లు సమాచారం. గ్రామ సచివాలయాల్లో మిగులు ఉద్యోగుల్లో అత్యధికంగా సర్వేయర్లు (గ్రేడ్-3) 4,722మంది, గ్రామ మహిళా పోలీసులు 2,107 మంది, విఆర్‌ఓలు 2,899 మంది వార్డు రెగ్యులరేషన్ కార్యదర్శులు 1,336మంది ఉన్నారు.

# ఎయిర్‌టెల్ రీచార్జ్ ప్లాన్లు.. రూ.200 దగ్గరలో మంత్లీ వ్యాలిడిటీ




ఇటీవల టెలికాం రీఛార్జ్ ప్లాన్లు మరింత ఖరీదైనవిగా మారాయి. దీంతో ఒకటి కంటే ఎక్కువ మొబైల్ నంబర్లను వినియోగిస్తున్నవారికి మరింత భారంగా మారింది. పెద్ద డేటా ప్యాకేజీలు కాకుండా తమ నంబర్‌ను యాక్టివ్‌గా ఉంచుకుంటే చాలని కొంతమంది యూజర్లు భావిస్తున్నారు. మీరు ఎయిర్‌టెల్ కస్టమర్ అయి ఇటువంటి తక్కువ ధరలో రీచార్జ్ ప్లాన్‌ల కోసం చూస్తున్నట్లయితే ఈ సమాచారం మీ కోసమే..

ఎయిర్‌టెల్ వివిధ వర్గాల వినియోగదారుల అవసరాలను తీర్చే ప్రీపెయిడ్ రీఛార్జ్ ప్లాన్ల శ్రేణిని అందిస్తోంది. పెద్ద మొత్తంలో డేటా అవసరం లేకుండా తక్కువ ధరలో నెలవారీ రీఛార్జ్ కోసం చూస్తున్నవారికి, రోజువారీ డేటా ప్రయోజనాలతో పాటు లాంగ్ వాలిడిటీని అందించే ప్లాన్లు సుమారు రూ .200 వద్ద ఎయిర్‌టెల్‌లో ఉ?న్నాయి. ఆ చౌకైన ప్రీపెయిడ్ ప్లాన్లు ఏవో ఇక్కడ పరిశీలిద్దాం.

**రూ.211 ప్లాన్**

ఇది 30 రోజుల వ్యాలిడిటీతో వస్తుంది. ఇందులో రోజుకు 1 జీబీ లభిస్తుంది. అంటే 30 రోజులకు మొత్తం 30 జీబీ లభిస్తుందన్నమాట. అయితే ఇందులో కాలింగ్, ఎస్ఎంఎస్ ప్రయోజనాలు ఉండవు. ఎందుకంటే ఇది డేటా ఓన్లీ ప్లాన్. బ్రౌజింగ్, సోషల్ మీడియా లేదా ఇతర ఆన్‌లైన్ కార్యకలాపాల కోసం ప్రధానంగా మొబైల్ డేటాను ఉపయోగించేవారికి ఈ ప్లాన్ అనువైనది.

**రూ .219 ప్లాన్**

డేటా, వాయిస్ కాలింగ్ ప్రయోజనాలు రెండింటినీ కోరుకునే వినియోగదారులకు ఎయిర్‌టెల్ రూ .219 ప్రీపెయిడ్ ప్లాన్ మంచి ఎంపిక. ఈ ప్లాన్ 30 రోజుల వాలిడిటీని అందిస్తుంది. నెల మొత్తం 3 జీబీ డేటాను అందిస్తుంది. నెలంతా అపరిమిత కాలింగ్, 300 ఎస్ఎంఎస్ ప్రయోజనాలు ఆనందించవచ్చు.

**ఎలా రీచార్జ్ చేసుకోవాలి?**

ఎయిర్‌టెల్ ప్రీపెయిడ్ ప్లాన్ల కోసం రీఛార్జ్ చేసుకోవడం చాలా సులభం. ఎయిర్‌టెల్ థ్యాంక్స్ యాప్ ద్వారా నేరుగా మీ ఎయిర్‌టెల్ నంబర్‌ను రీఛార్జ్ చేసుకోవచ్చు. అలాగే ఎయిర్‌టెల్ అధికారిక వెబ్‌సైట్‌లోనూ, పేటీఎం, ఫోన్ పే, గూగుల్ పే వంటి పాపులర్ థర్డ్ పార్టీ రీఛార్జ్ యాప్‌లలో కూడా ఈ ప్లాన్‌లు అందుబాటులో ఉన్నాయి.

# హైదరాబాద్‌లో హెచ్‌సీఎల్ టెక్ మరో జీడీసీ.. 5,000 మందికి ఉద్యోగాలు







ప్రముఖ ఐటీ సంస్థ హెచ్‌సీఎల్ టెక్ హైదరాబాద్‌లో మరో గ్లోబల్ డెలివరీ సెంటర్‌ను తెరిచింది. హైటెక్ సిటీలో ఏర్పాటైన ఈ గ్లోబల్ డెలివరీ సెంటర్‌ను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. నగరంలో హెచ్‌సీఎల్ టెక్ సంస్థకు ఇది ఐదో గ్లోబల్ డెలివరీ సెంటర్. ఈ అత్యాధునిక కేంద్రంలో 5,000 మంది ఉద్యోగులు పని చేసుకునేందుకు వెసులుబాటు ఉంది. హైదరాబాద్‌లో హెచ్‌సీఎల్ టెక్ తాజాగా ఏర్పాటు చేసిన గ్లోబల్ డెలివరీ సెంటర్ 3,20,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంది. ఇది ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ నుండి గోల్డ్ సర్టిఫికేషన్ పొందింది. ఈ కేంద్రం ద్వారా 5,000 ఉద్యోగాలు లభిస్తాయని, ప్రముఖ టెక్ గమ్యస్థానంగా హైదరాబాద్ స్థానాన్ని మరింత బలోపేతం చేస్తుందని అంచనా. 2007 నుండి హెచ్‌సీఎల్ టెక్ సంస్థకు హైదరాబాద్ వ్యూహాత్మక ప్రదేశంగా ఉంది. నగరంలో ఈ సంస్థకు 10,000 మందికి పైగా ఉద్యోగులు ఉన్నారు. కొత్త కేంద్రం గ్లోబల్ కెపాసిటీ సెంటర్లకు మద్దతు ఇస్తుంది. ఫైనాన్స్, మాన్యుఫాక్చరింగ్, హెల్త్‌కేర్ వంటి రంగాలలో అధునాతన పరిష్కారాలను అందిస్తుంది.

**గ్లోబల్ ఏఐ హబ్ గా తెలంగాణ**

ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా, గ్లోబల్ ఏఐ హబ్ గా తెలంగాణ శరవేగంగా రూపాంతరం చెందుతోందని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఇన్నోవేషన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, స్కిల్డ్ వర్క్ ఫోర్స్ పట్ల రాష్ట్రానికి ఉన్న నిబద్ధతను ఆయన నొక్కి చెప్పారు. తెలంగాణ 2.0 గ్రోత్ విజన్ ద్వారా వృద్ధిని వేగవంతం చేయడానికి రాష్ట్రం కట్టుబడి ఉందని రాష్ట్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు పునరుద్ఘాటించారు. హెచ్ సీఎల్ టెక్ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ సి.విజయకుమార్ కొత్త కేంద్రంపై హర్షం వ్యక్తం చేస్తూ.. 'కృత్రిమ మేధ నేతృత్వంలోని సాంకేతిక పరిజ్ఞానంలో ఉత్తేజకరమైన దశలో మనం ఉన్నాం. మా క్లయింట్లకు ఈ పరిష్కారాలను అందించడానికి మా గ్లోబల్ నెట్వర్క్‌లో హైదరాబాద్ ఒక వ్యూహాత్మక స్థానం. ఇక్కడి గ్లోబల్ కెపాసిటీ సెంటర్ల పురోగతికి కృషి చేస్తాం' అన్నారు.

# ఎల్ఐసీకి నోటీసులు.. రూ.480 కోట్లు చెల్లించాలి




ప్రభుత్వ రంగ బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (LIC)కి భారీ మొత్తంలో జీఎస్టీ (GST) చెల్లించాలని నోటీసు వచ్చింది. 2020-21 ఆర్థిక సంవత్సరానికి గాను ముంబైలోని స్టేట్ ట్యాక్స్ డిప్యూటీ కమిషనర్ నుంచి జీఎస్టీ డిమాండ్ ఆర్డర్ అందుకున్నట్లు ఎల్ఐసీ తెలిపింది. జీఎస్టీ, వడ్డీ, పెనాల్టీతో కలిపి మొత్తం రూ.479.88 కోట్లు చెల్లించాలని ఆ నోటీసులో ఉంది.ఈ రూ.479.88 కోట్ల మొత్తంలో జీఎస్టీ రూపంలో రూ.242.23 కోట్లు, వడ్డీ కింద రూ.213.43 కోట్లు, పెనాల్టీ రూపంలో రూ.24.22 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఇన్ పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ)ను తప్పుగా పొందడం, షార్ట్ రివర్స్ చేయడం, ఆలస్య చెల్లింపులపై వడ్డీ, తక్కువ పన్ను చెల్లించడం వంటి కారణాలతో ఈ నోటీసు జారీ చేసినట్లుగా ఎల్ఐసీ రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. ఈ ఆర్డర్‌ను ముంబైలోని జాయింట్ కమిషనర్ ఆఫ్ స్టేట్ టాక్స్ (అప్పీల్స్) ముందు అప్పీల్ చేసే అవకాశం ఉందని ఎల్ఐసి పేర్కొంది. కాగా ఈ డిమాండ్ నోటీసు తమ ఆర్థికాంశాలు లేదా కార్యకలాపాలపై నేరుగా ఎటువంటి ప్రభావాన్ని చూపదని స్పష్టం చేసింది. 'ఈ డిమాండ్ ఆర్థిక ప్రభావం జీఎస్టీ, వడ్డీ, పెనాల్టీల వరకే ఉంటుంది. కార్పొరేషన్ ఆర్థిక, ఇతర కార్యకలాపాలపై ఎటువంటి భౌతిక ప్రభావం ఉండదు" అని ఎల్ఐసీ తెలిపింది.

**మెరుగైన లాభాలు**

ఇటీవల ప్రకటించిన త్రైమాసిక ఫలితాలలో ఎల్ఐసీ బలమైన పనితీరును ప్రకటించింది. 2025 ఆర్థిక సంవత్సరం మూడవ త్రైమాసికంలో మెరుగైన పెట్టుబడి ఆదాయం, అధిక ప్రీమియం వసూళ్లతో లాభంలో 16 శాతం పెరుగుదలను నమోదు చేసింది. కార్యకలాపాల నుండి కూడా ఆదాయం గణనీయంగా పెరిగింది. లాభాల వృద్ధితో పాటు ఎల్ఐసీ నికర ప్రీమియం ఆదాయం ఏడాది ప్రాతిపదికన 12 శాతం పెరిగి రూ.1.5 లక్షల కోట్లకు చేరింది.




## ఫ్లాట్‌గా ముగిసిన మార్కెట్లు.. ఎన్‌బీఎఫ్‌సీలదే హవా..

దేశీయ స్టాక్‌మార్కెట్లు గురువారం ఫ్లాట్‌గా ముగిశాయి. విస్తృత సూచీలు తీవ్ర అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నప్పటికీ భారత బెంచ్ మార్క్ సూచీలు అత్యంత స్వల్ప స్థాయిలో కదిలాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 74,834 వద్ద గరిష్ట స్థాయి నుండి 74,521 వద్ద కనిష్టానికి పడిపోయింది. చివరికి 10 పాయింట్ల లాభంతో 74,612 వద్ద ఫ్లాట్ నోట్ వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 ఇండెక్స్ 100 పాయింట్ల స్వల్ప శ్రేణిలో కదలాడింది. 22,613 వద్ద గరిష్ట స్థాయి నుండి ఇండెక్స్ 22,508 వద్ద కనిష్టానికి పడిపోయింది. చివరికి దాదాపుగా 22,545 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 30 స్టాక్స్‌లో బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్సర్వ్ చెరో 2 శాతానికి పైగా లాభపడ్డాయి. ఇండస్ఇండ్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, జొమాటో, యాక్సిస్ బ్యాంక్ 1 శాతానికి పైగా పెరిగాయి. మరోవైపు వైర్లు, కేబుల్స్ వ్యాపారంలోకి ప్రవేశించే ప్రణాళికను ప్రకటించిన తర్వాత అల్ట్రాటెక్ సిమెంట్ దాదాపు 5 శాతం పడిపోయింది. అదేసమయంలో మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటార్స్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, హిందుస్థాన్ యూనిలీవర్, ఎన్టీపీసీ షేర్లు నష్టపోయాయి. విస్తృత మార్కెట్లో బీఎస్ఈ మిడ్ క్యాప్ ఇండెక్స్ 1 శాతం, స్మాల్ క్యాప్ ఇండెక్స్ 2 శాతానికి పైగా పడిపోయాయి. బంధన్ బ్యాంక్, ఎల్ అండ్ టీ ఫైనాన్స్, ఏయూ బ్యాంక్, క్రెడిట్యాక్సెస్ గ్రామీణ్, టీటీకే హెల్త్‌కేర్, చోళమండలం హోల్డింగ్స్, ఆర్బీఎల్ బ్యాంక్ 5-8 శాతం మధ్య లాభపడ్డాయి. మరోవైపు ఆర్ఆర్ కబెల్, కేఈఐ ఇండస్ట్రీస్, విజయ డయాగ్నస్టిక్స్, ప్రజ్ ఇండస్ట్రీస్, అజంతా ఫార్మా, ప్రెస్టీజ్ ఎస్టేట్స్, ఎక్సైడ్ ఇండస్ట్రీస్, డిక్సన్ టెక్నాలజీస్ షేర్లు నష్టపోయాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎంఎఫ్ఐ రుణాలు, ఎన్‌బీఎఫ్‌సీలకు రుణాలపై రిస్క్ వెయిట్‌ను తగ్గించిన తరువాత క్రెడిట్యాక్సెస్ గ్రామీణ్, ఎల్ అండ్ టి ఫైనాన్స్, మహీంద్రా అండ్ మహీంద్రా ఫైనాన్స్ వంటి నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు , మైక్రో ఫైనాన్స్ షేర్లకు గురువారం డిమాండ్ ఏర్పడింది.

## ఐక్యత కోసం జరిగిన మహా యజ్ఞం

**న్యూఢిల్లీ:** ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక 'మహాకుంభమేళా' ఘనంగా ముగిసింది. 45 రోజుల పాటు సాగిన ఈ కుంభమేళా విశేషాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన బ్లాగ్‌లో రాశారు. ఇంత పెద్ద కార్యక్రమాన్ని నిర్వహించడం అంత సులువు కాదన్నారు. ఏర్పాట్ల విషయంలో భక్తులెవరైనా అసౌకర్యానికి గురైతే గనుక అందుకు క్షమించాలని కోరారు. 'ఐక్యత కోసం జరిగిన మహాయజ్ఞం దిగ్విజయంగా ముగిసింది. భారతీయ ఐక్యతకు కుంభమేళా నిదర్శనంగా నిలిచింది. అంచనాలను మించి వివిధ ప్రాంతాల నుంచి కోట్లాది మంది భక్తులు తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరించారు. భారత్ కొత్త శక్తితో ముందుకుసాగుతోందని, నవ భారత్‌ను నిర్మించే కొత్త శకం వచ్చిందని చెప్పేందుకు ఇదే నిదర్శనం అని అన్నారు. ఇంత గొప్ప కార్యక్రమాన్ని దేనితోనూ పోల్చలేం. త్రివేణి సంగమం నదీ తీరానికి అన్ని కోట్ల మంది ఎలా వచ్చారా? అని యావత్ ప్రపంచం ఆశ్చర్యపోతోంది. ఈ భక్తులెవరికీ అధికారిక ఆహ్వానాలు పంపలేదు. అయినా పవిత్ర సంగమంలో పుణ్యస్నానాల కోసం వారంతా తరలివచ్చారు. నదిలో స్నానమాచరించిన తర్వాత వారి ముఖాల్లో కన్పించిన సంతోషం, సంతృప్తి నేనెప్పటికీ మర్చిపోలేను. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు చాలామంది వ్యయప్రయాసలకోర్చి కుంభమేళాకు రావడం ఆనందంగా ఉందని మోదీ రాసుకొచ్చారు. ఈసందర్భంగా మహాకుంభమేళాను విజయవంతం చేసిన యూపీ ప్రభుత్వం, సహకరించిన ప్రయాగ్‌రాజ్ ప్రజలు, భక్తులకు మోదీ ధన్యవాదాలు తెలిపారు. 'ఇంతటి పెద్ద కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా నిర్వహించడం అనేది అంత సులువు కాదని తెలుసు. మా పూజల్లో ఏదైనా లోపం ఉంటే క్షమించాలని ఆ గంగా, యమునా, సరస్వతి మాతలను ప్రార్థిస్తున్నా. భగవంతుని స్వరూపాలుగా భావించే భక్తులకు సేవ చేయడంలో ఏదైనా లోపం ఉంటే అందుకు ప్రజలు కూడా క్షమించాలని కోరుతున్నా' అని మోదీ రాసుకొచ్చారు

## భర్తపై కేసు పెట్టిన బాక్సర్ స్వీటీ బూర





నేషనల్ బ్యూరో: అర్జున అవార్డు గ్రహీత, బాక్సింగ్‌లో మాజీ ప్రపంచ చాంపియన్ స్వీటీ బూర వరకట్న వేధింపులను ఎదుర్కొంటున్నారు. ఈ మేరకు ఆమె భర్త ఆసియా క్రీడల్లో కాంస్య పతక విజేత దీపక్ హుడాపై పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు. భర్తతో అతని కుటుంబం వరకట్నం కోసం తనను కొట్టారని స్వీటీ ఆరోపించింది. వీరు 2022లో పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. హర్యానాలోని హిసార్‌లో హుడాపై స్వీట్ కేసు పెట్టింది. ఈ విషయంపై హిసార్ వుమెన్స్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో సీమా మాట్లాడుతూ స్వీటీ బూర ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమె భర్త దీపక్ హుడాపై ఈ నెల 25న ఎఫ్ఐఆర్ నమోదైందని తెలిపారు. విచారణ కోసం రావాలని రెండుసార్లు నోటీసులు ఇచ్చినా.. అతను రాలేదని తెలిపారు. అయితే, హుడాను సంప్రదించగా.. ఆరోగ్యం బాగాలేదని చెప్పినట్లు ఓ నివేదిక పేర్కొంది. తాను స్ట్రోక్ బారినపడ్డానని, దాంతో హాజరు కాలేకపోయినట్లు జాతీయ మీడియా నివేదిక పేర్కొంది. తాను తప్పనిసరిగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్తానని, తాను మాత్రం భార్యకు వ్యతిరేకంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయనని తెలిపాడు. దీనిపై స్వీటీని సంప్రదించగా.. స్పందించేందుకు నిరాకరించింది.

## ఇంగ్లాండ్ ఓటమితో మాజీ క్రికెటర్ కన్నీరు



నేషనల్ బ్యూరో: ఛాంపియన్స్ ట్రోఫీ వన్డే టోర్నీలో అఫ్గానిస్థాన్ సత్తా చాటింది. గ్రూప్‌బి మ్యాచ్‌లో ఇంగ్లాండ్‌ను ఓడించిన సంగతి తెలిసిందే. దీంతో తమ దేశం ఓటమి పాలవడంతో ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్ నీల్ ఫెయిర్ బ్రదర్ కన్నీరు పెట్టుకున్నారు. లాహోర్ వేదికగా ఇంగ్లాండ్ అఫ్గానిస్థాన్‌ల మధ్య వర్చువల్ నాకౌట్ మ్యాచ్ జరిగింది. ఎనిమిది పరుగుల తేడాతో అఫ్గానిస్థాన్ విజయం సాధించింది. మ్యాచ్ అనంతరం ఇంగ్లాండ్ ఓడిపోయిందంటూ స్నేహితుడు ఫెయిర్‌బ్రదర్‌కి, పాకిస్తాన్ క్రికెటర్ వసీం అక్రమ్ మెసేజ్ చేశాడు. అదివిని ఓటమితో కన్నీరు పెట్టుకున్నానని నీల్ ఫెయిర్‌బ్రదర్ తనతో చెప్పాడని అక్రమ్ తెలిపాడు. 'ఇంగ్లాండ్ ఆట తీరుతో ఆ దేశ ప్రజలు ఎంతో కలత చెందారు. ఈ విషయం గురించి చెప్పినప్పుడు ఫెయిర్‌బ్రదర్ కంట తడి పెట్టుకున్నాడు. ఇది కేవలం ఆట మాత్రమేనని అతనికి ధైర్యం చెప్పాను' అని ఓ కార్యక్రమంలో అక్రమ్ వెల్లడించాడు.

## వర్షార్పణం.. పాక్, బంగ్లా మ్యాచ్ రద్దు

నేషనల్ బ్యూరో: ఛాంపియన్స్ ట్రోఫీని ఆతిథ్య పాకిస్థాన్ ఒక్క విజయం లేకుండా ముగించింది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన జట్టు మొదటి రెండు మ్యాచ్‌ల్లో ఓడి లీగ్ దశలోనే ఇంటిముఖం పట్టింది. దీంతో బంగ్లాదేశ్‌తో చివరి లీగ్ మ్యాచ్‌లో గెలిచి పరువు కాపాడుకోవాలనుకున్న పాక్ ఆశలపై వరుణుడు నీళ్లు చల్లాడు. వర్షం కారణంగా పాక్, బంగ్లా మ్యాచ్ టాస్ పడకుండానే రద్దయింది. గురువారం రావల్పిండిలో ఉదయం నుంచి వర్షం కురిసింది. దీంతో మైదానమంతా చిత్తడిగా మారింది. ఔట్‌ఫీల్డ్ మొత్తం జలమయం అవడంతో మ్యాచ్ నిర్వహణ సాధ్యం కాలేదు. టాస్ కూడా వేయకుండానే మ్యాచ్‌ను రద్దు చేసిన అంపైర్లు.. ఇరు జట్లకు చెరో పాయింటు కేటాయించారు. పాకిస్థాన్‌తోపాటు బంగ్లాదేశ్ ఒక్క విజయం లేకుండానే టోర్నీని ముగించింది. రావల్పిండిలో మంగళవారం ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా మధ్య జరగాల్సిన మ్యాచ్ కూడా వర్షార్పణమైన విషయం తెలిసిందే.





## ఆస్ట్రేలియాకు అఫ్గాన్ కోచ్ వార్నింగ్

నేషనల్ బ్యూరో: ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో భాగంగా బుధవారం అఫ్గానిస్థాన్, ఇంగ్లాండ్ మధ్య కీలక మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌లో ఆఫ్గాన్.. ఇంగ్లాండ్‌ను ఓడించింది. దీంతో ఇంగ్లాండ్ ఈ టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఈ క్రమంలో అఫ్గాన్ జట్టు కోచ్ జోనాథన్ ట్రాట్ ఆస్ట్రేలియాకు ఓ వార్నింగ్ ఇచ్చాడు. 'ఇప్పుడు ఎవరూ అఫ్గాన్ జట్టును తేలికగా తీసుకోరు. గతంలో కూడా అఫ్గానిస్థాన్ అద్భుతంగా రాణించింది. ఇప్పుడు మేము మరింత బలంగా ఉన్నాం. తర్వాత జరిగే మ్యాచ్‌లో ఆస్ట్రేలియా జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా ఈ మ్యాచ్ సెమీ ఫైనల్స్ మార్గాన్ని నిర్ణయించే మ్యాచ్ కావడం వల్ల' అని ట్రాట్ పేర్కొన్నాడు. 2023 ప్రపంచ కప్‌లో అఫ్గానిస్థాన్ జట్టు ఇంగ్లాండ్, పాకిస్తాన్, శ్రీలంక జట్లను ఓడించి సెమీఫైనల్స్‌కు చేరుకుంది. 2022లో కోచ్‌గా జోనాథన్ ట్రాట్ అఫ్గానిస్థాన్ జట్టుకు బాధ్యతలు చేపట్టిన తర్వాత జట్టు మరింత పురోగతి సాధించింది.

---

## ఐటెమ్ సాంగ్ పాడినందుకు సిగ్గుపడుతున్నా

హైదరాబాద్: ఓ స్టార్ సింగర్ స్పెషల్ పాటపై కీలక వ్యాఖ్యలు చేసింది. తాను పాడిన పాట పిల్లలను కూడా చెడగొట్టిందని చెప్పారు. ఆ పాట పాడినందుకు తనకు సిగ్గుగా ఉందన్నారు. ఆమె చేసిన ఈ కామెంట్స్ ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి. ఎన్నో అద్భుతమైన పాటలు ఆలపించిన ఎంతో మంది అభిమానులను సొంతం చేసుకున్నారు శ్రేయా ఘోషాల్. 12 ఏళ్లలోనే పాటలు పాడటం ప్రారంభించి ఇప్పటి వరకు దాదాపు 25వేలకుపైగా పాటలు పాడింది. తాజాగా శ్రేయా చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తాను ఓ ఐటెం పాటపాడినందుకు సిగ్గుపడుతున్నానని చెప్పుకొచ్చింది. అగ్నిపథ్ మూవీలోని చికినీ చమేలీ అనే పాట పాడింది. పాట పాడినందుకు తాను సిగ్గుపడుతున్నట్లు చెప్పింది. ఐటెం సాంగ్స్‌లో చిన్న పిల్లలు వాటికి అర్థమేంటో తెలియకుండానే పాడేస్తున్నారు. కొంతమంది నా దగ్గరికి వచ్చిన మీ పాట చాలా బాగుంది.. మీకోసం పాడుతా అంటూ ఆ పాటను పాడుతున్నారు. ఆ సమయంలో నాకు కాస్త ఇబ్బందిగా అనిపించింది. ఓ ఐదేళ్ల పాప అలాంటి లిరిక్స్ పాడటం ఏమాత్రం సరికాదని శ్రేయ చెప్పుకొచ్చింది.



## నిజమా? స్మైల్ ఎమోజీతో జ్యోతిక రిప్లై



హైదరాబాద్: సినీరంగంలోని అందమైన జంటల్లో సూర్యజ్యోతికల జంట ఒకటి. సమయం వచ్చినప్పుడు ఇద్దరూ పరస్పరం ఒకరిపై ఒకరు ప్రేమను వ్యక్తపరుస్తుంటారు. తన తాజా వెబ్ సిరీస్ 'డబ్బా కార్టెల్' ప్రచారంలో బిజీగా ఉన్న జ్యోతిక సూర్యను ఉద్దేశించి వస్తోన్న ట్రోల్స్‌పై స్పందించారు. తాజాగా జ్యోతిక తన తాజా ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అయితే ఈ ఫొటో కామెంట్ సెక్షన్‌లో కొందరు నెటిజన్లు సూర్యను ఉద్దేశిస్తూ కామెంట్స్ పెట్టారు. ఇటీవల వచ్చిన ప్రదీప్ రంగనాథ్ సినిమా కలెక్షన్లను సూర్య సినిమా వసూళ్లతో పోలుస్తూ ట్రోల్ చేశారు. సూర్య కంటే కోలీవుడ్ హీరో విజయ్ బెటర్ అంటూ ఓ నెటిజన్ కామెంట్ పెట్టారు. దీనికి జ్యోతిక స్పందిస్తూ.. హాస్యాస్పదంగా ఉందనే అర్థం వచ్చేలా నవ్వు ఎమోజీని పెట్టారు. ప్రస్తుతం ఆమె రిప్లై వైరల్‌గా మారింది.

## కూలీ మూవీలో పూజా హెగ్డే



హైదరాబాద్: తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ నటిస్తున్న తాజా చిత్రం 'కూలీ'. తమిళ్ స్టార్ దర్శకుడు లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమాలో హస్కి బ్యూటీ శృతి హాసన్ నటిస్తుండగా తాజాగా మరొక యంగ్ భామను తీసుకున్నారు. తెలుగులో ఎన్నో సూపర్ హిట్ సినిమాల్లో నటించిన పూజా హెగ్డే కూలీ సినిమాలో నటిస్తోన్నట్లు పోస్టర్ రిలీజ్ చేశారు. పూజా హెగ్డే ఇటీవల వరుస తమిళ్ సినిమాలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తుంది. ఒకవైపు సూర్య, కార్తీక్ సుబ్బరాజ్ కాంబోలో వస్తున్న రెట్రోలో హీరోయిన్‌గా ఫిక్స్ అవగా లారెన్స్ డైరెక్షన్‌లో కాంచన 4లోను నటిస్తుంది. తాజగా కూలీలో నటిస్తుంది. తెలుగు సినిమాలకు మాత్రం దూరంగా ఉంటుంది, టాలీవుడ్‌కు నో చెప్పి బాలీవుడ్‌లో జై కొట్టి తీరా అక్కడ ఫ్లాప్స్ రావడంతో కోలీవుడ్‌లో అడుగుపెట్టింది. అయితే కూలీలో స్పెషల్ సాంగ్‌లో నటిస్తుందా లేక ఏదైనా ముఖ్య పాత్ర అన్నది క్లారిటీ ఇవ్వలేదు మేకర్స్.

## పుట్టబోయే పిల్లల గురించి కామెంట్లా!



హైదరాబాద్: నటి ప్రియమణి టాలీవుడ్, బాలీవుడ్‌లలో ప్రస్తుతం బిజీగా మారారు. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. పెళ్లి చేసుకున్నప్పటి నుంచి కొందరు తనను విమర్శించడమే లక్ష్యంగా పెట్టుకున్నారని చెప్పారు. తనకు పుట్టబోయే పిల్లల గురించి కూడా కామెంట్స్ చేస్తున్నారని అసహనం వ్యక్తంచేశారు. 2017లో ముస్తాఫారాజ్‌తో ప్రియమణి వివాహం చేసుకుంది. 2016లో తన నిశ్చితార్థం జరిగిన నాటినుంచి ఆన్‌లైన్ వేదికగా విమర్శలు ఎదురవ్వడం ప్రారంభమయ్యాయని ప్రియమణి చెప్పారు. 'నాకు ఎంగేజ్‌మెంట్ జరగ్గానే నా మనుషులంతా ఆనందిస్తారని అనుకున్నాను. వారితో ఈ సంతోషకరమైన క్షణాలను పంచుకోవాలనుకున్నా. కానీ, అప్పటినుంచి నాపై అనవసరమైన ద్వేషం ప్రారంభమైంది. లవ్ జిహాద్ ఆరోపణలు వచ్చాయి. పిల్లలు పుట్టాక వారిని ఐసిస్‌లో జాయిన్ చేస్తారా అంటూ కామెంట్స్ పెడుతున్నారు. అవి ఎంతగానో బాధ పెడుతున్నాయి. నా భర్త గురించి వివరాలు కూడా మీకు తెలియవు. ఇప్పటికీ కూడా నేను నా భర్తతో దిగిన ఫొటోను పోస్ట్ చేస్తే, పదిలో తొమ్మిది కామెంట్స్ మా పెళ్లి మీదనే ఉంటాయి. వాటివల్ల బాధపడాల్సి వస్తోంది' అని ప్రియమణి అన్నారు.